అంబటి రాంబాబు ప్రవర్తన సమాజాన్ని
అవమానించేలా ఉంది. ఆయన
మాటలు వైసీపీ దిగజారుడు
రాజకీయాలకు నిదర్శనం.
ముఖ్యమంత్రి, సీనియర్ నాయకులపై
నీచ భాష వాడటం అంగీకారయోగ్యం
కాదు. వైసీపీ క్షమాపణ చెప్పి, అంబటిని
వెంటనే సస్పెండ్ చేయాలి.



ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ

సోమవారం 02.02.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 | సంచిక - 286 | www.journalistfile.com | పేజీలు 8 | వెల : రూ.5.00



# వికసిత భారతానికి క్రమశిక్షణ

## యువశక్తి, అభివృద్ధే టార్గెట్‌గా 2026-27 బడ్జెట్

ఉచితాలకు సెలవు

- దీర్ఘకాలిక లక్ష్యాలతో కేంద్ర బడ్జెట్ మౌలిక సదుపాయాల సృష్టికి ప్రాధాన్యం
- వరుసగా తొమ్మిదోసారి బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్
- మూడు కర్తవ్యాలే స్ఫూర్తిగా బడ్జెట్ రూపకల్పన - మొత్తం బడ్జెట్ రూ.53.5 లక్షల కోట్లు
- ఆదాయ పన్ను రేట్లలో మార్పులేదు - ఏప్రిల్ 1నుంచి నూతన ఆదాయపు పన్ను చట్టం అమలు
- పన్నుల్లో రాష్ట్రాల వాటా రూ.1.4లక్షల కోట్లకు పెంపు
- రెండేళ్లలో కస్టమ్స్ ఇంటిగ్రేటెడ్ సిస్టమ్ ప్రకటన
- ద్రవ్యలోటు 4.3%గా అంచనా - ఎస్ఎంఇల వృద్ధికి ప్రత్యేక నిధి
- 2047 నాటికి సేవల రంగం వాటాను 10% పెంచడానికి ఉన్నతస్థాయి కమిటీ
- దేశంలో ఏర్పాటు చేసే విదేశీ డేటా సెంటర్లకు 2047 వరకు పన్ను మినహాయింపు
- విదేశీ ఆస్తుల వెల్లడికి వన్ సెటిల్మెంట్ బయోఫార్మాకు రూ.10వేల కోట్లు
- ఉపాధి కల్పనకు పెద్దపీట 500 కళాశాలల్లో కంటెంట్ క్రియేటర్ల ల్యాబ్లు
- దివ్యాంగుల కోసం దివ్యాంజన్ కౌశల్ యోజన పన్ను వివాదాల్లో జైలుశిక్ష తగ్గింపు
- 'కస్టమ్స్' తగ్గింపు - ఎగుమతులు పెంచే వ్యూహాలు - 2047 వరకూ డేటా సెంటర్లకు ట్యాక్స్ హాలిడే
- దేశంలో మరిన్ని మెగా టెక్స్టైల్ పార్కులు - రేర్ ఎర్త్ మినరల్స్ కారిడార్లు.. ఏపీకి ఒకటి

2 లో

**మొత్తం బడ్జెట్** ₹ 53,47,315 కోట్లు

**రెవెన్యూ వసూళ్లు** ₹ 35,33,150 కోట్లు

**రెవెన్యూ వ్యయం** ₹ 41,25,494 కోట్లు

**మూలధన వసూళ్లు** ₹ 18,14,165 కోట్లు

**మూలధన వ్యయం** ₹ 12,21,821 కోట్లు

| రూపాయి రాక (అంకెలు పైసల్లో) | | రూపాయి పోక (అంకెలు పైసల్లో) | |
|---|---|---|---|
| రుణేతర మూలధన వసూళ్లు | 2 | కేంద్ర ప్రాయోజిత పథకాలు | 8 |
| ఇతర అప్పులు | 24 | సబ్సిడీలు | 6 |
| పన్నేతర ఆదాయం | 10 | రక్షణ రంగం | 11 |
| కస్టమ్స్ | 4 | వడ్డీ చెల్లింపులు | 20 |
| జీఎస్టీ | 15 | పన్నులు, సుంకాల్లో రాష్ట్రాల వాటా | 22 |
| కార్పొరేషన్ ట్యాక్స్ | 18 | ఫైనాన్స్ కమిషన్, బదిలీలు | 7 |
| కేంద్ర ఎక్సైజ్ సుంకాలు | 6 | కేంద్ర ప్రభుత్వ రంగ పథకాలు | 17 |
| ఆదాయపు పన్ను | 21 | ఇతర ఖర్చులు | 7 |

### వికసిత భారత్ లక్ష్యానికి

## కేంద్ర బడ్జెట్ మార్గదర్శకం

- ఏపీ బీజేపీ చీఫ్ పివిఎన్ మాధవ్ వ్యాఖ్యలు




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమర్పించిన కేంద్ర బడ్జెట్ దేశ అభివృద్ధికి దిశా నిర్దేశం చేస్తుందని, సుస్థిర ప్రభుత్వం వికసిత భారత్ లక్ష్యానికి అనుగుణంగా ముందడుగు వేస్తుందని ఏపీ బీజేపీ చీఫ్ పివిఎన్ మాధవ్ తెలిపారు. లోక్‌సభలో సమర్పించిన ఈ బడ్జెట్‌లో వ్యవసాయం, పరిశ్రమ, యువత, క్రీడలు, హ్యాండ్లూమ్, వస్త్ర పరిశ్రమ, మరియు సాంకేతిక రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వబడిందని చెప్పారు.

బయోఫార్మా రంగానికి విరాళం కేటాయించడం, ఏపీ, ఒడిశా, తమిళనాడు, కేరళలో గనుల మార్గాలు ఏర్పాటు చేయడం, రసాయన పరిశ్రమ కోసం మూడు ప్రత్యేక పార్కులు నిర్మించడం, ఇప్పటికే ఉన్న విద్యాసంస్థల ఆధునీకరణ, దేశవ్యాప్తంగా రెండు అత్యాధునిక సాంకేతిక రూములు ఏర్పాటు చేయడం వంటి చర్యలు బడ్జెట్‌లో సూచించబడ్డాయి. కంటైనర్ తయారీ రంగానికి విరాళం కేటాయించడం, సాంకేతిక పరిశ్రమల అభివృద్ధికి పెద్ద మొత్తంలో విరాళాలు, సెమీకండక్టర్ పరిశ్రమకు ప్రత్యేక ప్రణాళికలు, కొత్త పరిశోధనా కేంద్రాలు, పెద్ద వస్త్ర పార్కుల ఏర్పాటు, ఫైబర్ రంగానికి పథకాలు మొదలైనవి కేంద్రం ద్వారా చేపట్టబడ్డాయని పివిఎన్ మాధవ్ తెలిపారు.

## వికసిత భారతానికి ఊతమిచ్చేలా కేంద్ర బడ్జెట్

- డేటా సెంటర్లకు టాక్స్ హాలిడేతో మరింతగా ఐటీ రంగం వృద్ధి
- రైతులు, మహిళలు, యువతలో ఆర్థిక సాధికారితను పెంచేలా బడ్జెట్ కేటాయింపులు
- హైస్పీడ్ రైల్ , రేర్ ఎర్త్ కారిడార్లతో ఏపీకి మరింత లబ్ది
- కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ను స్వాగతించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- ప్రధాని మోదీకి, ఆర్థిక మంత్రికి అభినందనలు తెలిపిన సీఎం



**కుప్పం(జర్నలిస్ట్ ఫైల్) :** వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా కేంద్ర బడ్జెట్ రూపొందించారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభిప్రాయం వ్యక్తం చేశారు. దేశ భవిష్యత్ ను నిర్దేశించేలా బడ్జెట్ రూపకల్పన జరిగిందని అన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ పై సీఎం మీడియా సమావేశంలో స్పందించారు. కేంద్ర బడ్జెట్ ను స్వాగతిస్తున్నట్టు ఆయన తెలిపారు. అభివృద్ధికి దోహదపడేలా బడ్జెట్ ను తీర్చిదిద్దినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఫార్వార్డ్ లుకింగ్ బడ్జెట్. రాష్ట్రం అమలు చేస్తున్న ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విదానానికి ఈ బడ్జెట్ మరింత సహకరించేలా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఎంఎస్ఎంఈలపై ఎక్కువగా దృష్టి సారించింది. వీటిని మరింత బలోపేతం చేసుకునే అవకాశం ఉంది. మహిళలు, రైతులు, యువత మిగతా 2లో...

### మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

- బడ్జెట్‌లో ఆత్మనిర్భర్ భారత్‌కు కేటాయింపులు
- త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్
- కేంద్ర బడ్జెట్ : ప్రధాని మోదీ



**అమరాతి(జర్నలిస్ట్ ఫైల్) :** కేంద్ర బడ్జెట్ భవిష్యత్తుకు రోడ్‌మ్యాప్‌గా నిలుస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. 2047 మిషన్ లక్ష్యాల మేరకు కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టామన్నారు. త్వరలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. లోక్‌సభలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టిన నేపథ్యంలో ప్రధాని ఈ మేరకు వ్యాఖ్యానించారు.


"ఇవాళ చరిత్రాత్మక బడ్జెట్ ప్రవేశపెట్టామని, బడ్జెట్‌లో ఆత్మనిర్భర్ భారత్‌కు కేటాయింపులు. కేంద్ర బడ్జెట్ ద్రవ్యలోటును నియంత్రిస్తుంది. మౌలిక వసతుల కల్పనకు బడ్జెట్‌లో మరింత ఊతమిచ్చాం. లోకల్ నుంచి గ్లోబల్ స్థాయికి భారత్ ఎదిగింది. యువశక్తిని ప్రోత్సహించే విధంగా బడ్జెట్ ఉంది. యువతకు గేమింగ్, టూరిజం, క్రీడా సౌకర్యాలు. మిగతా 2లో...

### బడ్జెట్‌లో రైతులు, మహిళలకు భారీ శుభవార్త




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** దేశ వ్యాప్త రైతులకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ భారీ శుభవార్త అందించారు. 2027కు సంబంధించిన బడ్జెట్‌లో కీలక ప్రకటన చేశారు. వ్యవసాయ ఆదాయం పెంచేందుకు అధిక విలువ పంటలకు ప్రోత్సాహం మిగతా 2లో...

### ఏప్రిల్ 1వ తేదీ నుంచి కొత్త ఐటీ చట్టం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** సామాన్యులకు కేంద్ర తాజా బడ్జెట్‌తో భారీ ఉపశమనం లభించింది. ఏప్రిల్ 1వ తేదీ నుంచి దేశ వ్యాప్తంగా కొత్త ఆదాయపు పన్ను చట్టం అమలులోకి రాబోతోంది. సరళతరం చేసిన ఫారాలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. మిగతా 2లో...

### స్కూళ్లలోనే 'కంటెంట్ క్రియేటర్ ల్యాబ్స్'




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ 2026లో విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. భారతదేశంలోని యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ (AVGC) రంగాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లేందుకు నిర్ణయించింది. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ పరిశ్రమలో 2030 నాటికి సుమారు 20 లక్షల మంది నైపుణ్యం కలిగిన నిపుణుల అవసరం ఉందని అంచనా వేసిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, విద్యార్థి దశ నుంచే వారికి శిక్షణ ఇచ్చేలా భారీ ప్రాజెక్టును ప్రకటించారు. ముంబైలోని 'ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీస్' సహకారంతో దేశవ్యాప్తంగా 15,000 సెకండరీ స్కూళ్లు, 500 కాలేజీలలో అత్యాధునిక AVGC కంటెంట్ క్రియేటర్ ల్యాబ్స్' ఏర్పాటు చేయనున్నట్లు ఆమె వెల్లడించారు.

ఈ నిర్ణయం ద్వారా పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు యానిమేషన్, గ్రాఫిక్స్, గేమ్ డిజైనింగ్ వంటి సృజనాత్మక రంగాలలో ప్రయోగాత్మక శిక్షణ లభించనుంది. భారతదేశం కేవలం విదేశీ ప్రాజెక్టులకు సేవలు అందించడమే కాకుండా, సొంతంగా 'క్రియేట్ ఇన్ ఇండియా' బ్రాండ్‌తో ప్రపంచ స్థాయి కంటెంట్‌ను రూపొందించాలనేది ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యం. పెరుగుతున్న ఓటీటీ వినియోగం, గేమింగ్ పట్ల యువత మక్కువను దృష్టిలో ఉంచుకుని, ఈ రంగాన్ని ఒక ప్రధాన ఉపాధి వనరుగా మార్చడానికి ప్రభుత్వం ఈ భారీ పెట్టుబడి పెడుతోంది. ఇది భవిష్యత్తులో భారతీయ యువతను గ్లోబల్ క్రియేటివ్ ఎకానమీలో అగ్రగామిగా నిలబెట్టనుందని కేంద్ర మంత్రి నిర్మలమ్మ ప్రకటించారు.

### పదేళ్ల లక్ష్యంతో 'ఖేలో ఇండియా మిషన్'




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ 2026 లో భారతదేశాన్ని క్రీడల రంగంలో ప్రపంచ అగ్రగామిగా నిలబెట్టేందుకు అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రకటన చేసింది. గతంలో విజయవంతమైన 'ఖేలో ఇండియా' కార్యక్రమాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తూ, రాబోయే దశాబ్ద కాలంలో క్రీడా రంగాన్ని సమూలంగా మార్చే లక్ష్యంతో 'ఖేలో ఇండియా మిషన్'ను ప్రారంభిస్తున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. మిగతా 2లో...

### ఏపీతో సహా మరో నాలుగు రాష్ట్రాలతో మైనింగ్ మిషన్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో 2026-27 ఆర్థిక సంవత్సరానికి గానూ బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఈ నేపథ్యంలో ఖనిజ వనరులున్న రాష్ట్రాలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించనున్నట్టు ప్రకటించారు. రేర్ ఎర్త్ మినరల్స్ కోసం నాలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్టు తెలిపారు. మిగతా 2లో...



### క్యాన్సర్ రోగులకు భారీ ఉపశమనం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** క్యాన్సర్ రోగులకు భారీ ఉపశమనం లభించింది. బడ్జెట్ ప్రసంగంలో ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కీలక ప్రకటన చేశారు. క్యాన్సర్ రోగులు ఉపయోగించే 17 ఔషధాలపై పన్ను తగ్గిస్తున్నట్లు తెలిపారు. సెంట్రల్ ఎక్సైజ్ నుంచి బయో గ్యాస్ ద్వారా ఉత్పత్తయ్యే సీఎన్‌జీకి మినహాయింపు ఇచ్చారు. మైక్రో అవెన్స్‌పై పన్ను తగ్గించారు. పౌర విమానాల విడిభాగాలపైనా పన్ను తగ్గించినట్లు తెలిపారు. కాగా, క్యాన్సర్ రోగులు అలసట, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలతో తీవ్రంగా ఇబ్బంది పడుతుంటారు. ఈ సమస్యల నుంచి ఉపశమనం కోసం ఔషదాలు వాడుతుంటారు. కేంద్రం తాజా నిర్ణయంతో వీరికి భారీ ఉపశమనం లభించనుంది.

### యాక్సిడెంట్ క్లెయిమ్ వడ్డీపై 'నో ట్యాక్స్'



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రమాద బాధితులకు కేంద్ర బడ్జెట్ 2026- 27 లో భారీ ఊరట లభించింది. రోడ్డు ప్రమాదాలకు గురై కోర్టుల ద్వారా పరిహారం పొందే బాధితులకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ 2026 లో గొప్ప ఊరట నిచ్చింది. మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రైబ్యునల్ ద్వారా పొందే పరిహారంపై వచ్చే వడ్డీకి ఇకపై ఎటువంటి ఆదాయపు పన్ను చెల్లించాల్సిన అవసరం లేదని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. మిగతా 2లో...

### డేటా సెంటర్లు ఏర్పాటు చేసే సంస్థలకు ట్యాక్స్ హాలీడే



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** భారత్‌లో డేటా సెంటర్ల ఏర్పాటు చేసే సంస్థలకు కేంద్ర ప్రభుత్వం భారీ శుభవార్త చెప్పింది. 2047 వరకూ డేటా సెంటర్లు ఏర్పాటు చేసే సంస్థలకు ట్యాక్స్ హాలీడే ప్రకటించింది. ట్యాక్స్ హాలిడే నిర్ణయంతో క్లౌడ్ సేవల సంస్థలకు భారీ ప్రయోజనం చేకూరనుంది. సుస్థిరాభివృద్ధిని కొనసాగిస్తూ.. సంస్కరణలను పరుగులు పెట్టించే లక్ష్యంతోపాటు మిగతా 2లో...

## అసభ్య వ్యాఖ్యలపై చట్టపరమైన చర్యలు తప్పనిసరి



● ఏపీ బీజేపీ చీఫ్ పివిఎన్ మాధవ్ వ్యాఖ్యలు

విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) : టీడీపీ నాయకులు, కార్యకర్తలపై వైసీపీ నేతలు అంబటి రాంబాబు, జోగి రమేష్ చేసిన అసభ్య వ్యాఖ్యలు క్షమించలేనివని ఏపీ బీజేపీ చీఫ్ పివిఎన్ మాధవ్ అన్నారు. రాజకీయాల్లో దిగజారుడు భాషకు చోటు ఉండదని, ఇలాంటి వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నదని ఆయన చెప్పారు.

ఇలాంటి సందర్భాల్లో ఓపిక, సంయమనం పాటిస్తూ చట్టబద్ధ మార్గంలోనే పోరాటం కొనసాగించాల్సిన అవసరం ఉందని పివిఎన్ మాధవ్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో వ్యక్తులపై దాడులకు తావు లేదని, చట్టమే అందరికీ మార్గదర్శకం అవ్వాలని ఆయన అన్నారు.

## మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

(మొదటి పేజీ తరువాయి)

వికసిత్ భారత్ ప్రయాణం వేగవంతానికి బడ్జెట్ తోడ్పాటు. సంస్కరణలకు బడ్జెట్ నూతన ఉత్తేజాన్ని ఇస్తుంది. భారత్‌ను డేటా సెంటర్‌గా మార్చేందుకు ట్యాక్స్ హాలిడే. ఇది భారత్‌ను డేటా సెంటర్ హబ్‌గా మారుస్తుంది. ఉద్యోగాల కల్పనకు కేంద్ర బడ్జెట్ మరింత దోహదం చేస్తుంది. కేంద్ర బడ్జెట్ నారీశక్తిని ప్రతిబింబిస్తుంది. బడ్జెట్‌లో ఈశాన్య ప్రాంతాల పర్యాటకంపై దృష్టి పెట్టామని " ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు.

## వికసిత భారత్ లక్ష్యానికి కేంద్ర బడ్జెట్ మార్గదర్శకం

(మొదటి పేజీ తరువాయి)

అదనంగా, ఖాదీ, హ్యాండ్లూమ్, హస్తకళల ప్రోత్సాహం, నాణ్యమైన క్రీడా వస్తువుల తయారీ, గ్రామీణ పరిశ్రమల ఆధునీకరణ, చిన్న మరియు మైక్రో పరిశ్రమల అభివృద్ధికి విరాళాలు కేటాయించడం ద్వారా ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యం సాధించబడుతుందని చెప్పారు.

వ్యవసాయ రంగంలో ముఖ్యంగా కొబ్బరి చెట్ల పెంపకం, ఆయుర్వేద వైద్యశాలలు ఏర్పాటు వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చిన ఈ బడ్జెట్ దేశాన్ని వేగవంతమైన అభివృద్ధి దిశలో నడిపే నిర్ణయాలుగా ఉంటుందని, ప్రధాని మోడీ తీసుకున్న చర్యలు ప్రజలకు స్పష్టంగా అర్థమవుతాయని పివిఎన్ మాధవ్ పేర్కొన్నారు.

## బడ్జెట్‌లో రైతులు, మహిళలకు భారీ శుభవార్త

(మొదటి పేజీ తరువాయి)

ఇవ్వబోతున్నట్లు తెలిపారు. దీంతో పాటు తీర ప్రాంతాల్లో కొబ్బరి, గంధం చెట్ల ఏర్పాటుకు ప్రోత్సాహం, కొబ్బరి రైతుల కోసం కొత్త పథకం, కాయలు కాయని చెట్ల స్థానంలో కొత్త చెట్ల ఏర్పాటుకు ప్రోత్సాహం, జీడిపప్పు, కోకో ఉత్పత్తికి చర్యలు, గంధం చెట్ల వనాలు, ఆల్మండ్స్, పైన్ నట్స్ కోసం ప్రత్యేక పథకంతో పాటు మహిళల ద్వారా ప్రత్యే షీ బజార్‌ల ఏర్పాటుకు కేంద్రం ఆర్థిక సాయం చేయబోతోందని నిర్మలా సీతారామన్ ప్రకటించారు. దీని వల్ల ఏపీకి భారీ ఊరట లభిస్తుందని చెప్పుకోవచ్చు. ఇటీవల కొబ్బరి తోటలో అగ్ని ప్రమాదం జరిగి భారీ నష్టం జరిగిన విషయం తెలిసిందే. ఈ వార్త బాధిత రైతులకు ఉపశమనం కలిగించనుంది.

## ఏప్రిల్ 1వ తేదీ నుంచి కొత్త ఐటీ చట్టం

(మొదటి పేజీ తరువాయి)

సామాన్యులు సైతం ఫైల్ చేసేలా మార్పులు చేయబోతున్నట్లు బడ్జెట్ ప్రసంగంలో నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. గతేడాది (2025) బడ్జెట్‌లో రూ.12లక్షల వరకు వార్షిక ఆదాయం ఉన్నవారికి పన్ను మినహాయింపునిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ ఏడాది బడ్జెట్లో దానికి మించి పన్ను మినహాయింపులు ఉంటాయని వెల్లడైంది. ఇది పన్నుల వ్యవస్థను మరింత సరళతరం చేయడమే కాకుండా, పాత చట్టాల్లోని సంక్లిష్టతలను తగ్గించడమే లక్ష్యంగా తీసుకొచ్చారు.

## పదేళ్ల లక్ష్యంతో 'ఖేలో ఇండియా మిషన్'

(మొదటి పేజీ తరువాయి)

క్రీడా రంగం కేవలం వినోదానికే పరిమితం కాకుండా, ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ అవకాశాలకు బలమైన వేదికగా నిలుస్తుందని ఆమె ఈ సందర్భంగా సభలో ప్రకటించారు.

ఈ ఖేలో ఇండియా మిషన్ ద్వారా అట్టడుగు స్థాయి నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి, వారికి ప్రపంచ స్థాయి శిక్షణ అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది. కోచ్‌లకు అంతర్జాతీయ స్థాయి శిక్షణ, స్పోర్ట్స్ సైన్స్ పరిశోధనలు, అత్యాధునిక మౌలిక సదుపాయాల కల్పన, నిరంతర క్రీడా పోటీల నిర్వహణపై ఈ మిషన్ ప్రధానంగా దృష్టి సారిస్తోంది. 2030 కామన్వెల్త్ గేమ్స్, 2036 ఒలింపిక్స్ ఆతిథ్యం కోసం భారత్ సిద్ధమవుతున్న తరుణంలో, ఈ 'ఖేలో ఇండియా మిషన్' క్రీడాకారుల తయారీలో కీలక పాత్ర పోషించనుంది.

## ఏపీతో సహా మరో నాలుగు రాష్ట్రాలతో మైనింగ్ మిషన్

(మొదటి పేజీ తరువాయి)

ఏపీ, ఒడిశా, కేరళ, తమిళనాడు రాష్ట్రాలతో కలిసి ప్రత్యేక మైనింగ్ మిషన్ ఏర్పాటు చేయబోతున్నట్టు మంత్రి బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. అలాగే ప్రపంచస్థాయి కంటెయినర్ ఉత్పత్తి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

## డేటా సెంటర్లు ఏర్పాటు చేసే సంస్థలకు ట్యాక్స్ హాలీడే

(మొదటి పేజీ తరువాయి)

అంతర్జాతీయ ఒత్తిడులను, సుంకాలను తట్టుకునే చర్యలకు ప్రాధాన్యమిస్తూ 2026-27 సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను రూపొందించినట్లు పార్లమెంటులో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. కాగా, వరుసగా తొమ్మిదోసారి నిర్మలమ్మ బడ్జెట్‌ను ప్రవేశపెట్టి రికార్డు సృష్టించారు. దీంతో పాటు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఆదివారం బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుండటం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

## యాక్సిడెంట్ క్లెయిమ్ వడ్డీపై 'నో ట్యాక్స్'

(మొదటి పేజీ తరువాయి)


ఈ వడ్డీ ఆదాయాన్ని ఆదాయపు పన్ను నుంచి పూర్తిగా మినహాయిస్తున్నట్లు ఆమె వెల్లడించారు.

గతంలో ఈ వడ్డీ మొత్తం ఒక పరిమితి దాటితే దానిపై టీడీఎస్ మినహాయించేవారు. అయితే, తాజా బడ్జెట్ ప్రతిపాదనల ప్రకారం.. ప్రమాద బాధితులకు ఇచ్చే ఈ వడ్డీపై టీడీఎస్ విధానాన్ని పూర్తిగా రద్దు చేశారు. "ప్రమాదాల బారిన పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్న వ్యక్తులకు న్యాయపరంగా లభించే వడ్డీపై పన్ను భారం ఉండకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నాం" అని మంత్రి పేర్కొన్నారు. దీనివల్ల బాధితులకు కోర్టు కేటాయించిన పూర్తి నిధులు ఎటువంటి కోత లేకుండా నేరుగా అందుతాయి. ఈ నిర్ణయం ప్రమాద బాధితులు, వారి కుటుంబాలకు ఎంతో ఉపశమనం గా మారనుంది.

# వికసిత భారతానికి ఊతమిచ్చేలా కేంద్ర బడ్జెట్

(మొదటి పేజీ తరువాయి)

సాధికారిత సాధించేలా బడ్జెట్ ఉంది. 2047 వికసిత్ భారత్ డెవలప్డ్ ఎకానమీగా మారేందుకు ఇది ఉపయోగపడుతుంది. బ్యాలెన్సుడు బడ్జెట్ ఇది. ఏఐ సహా ఆధునిక సాంకేతికత, తదుపరి స్థాయి సంస్కరణలకు బడ్జెట్ ఊతమిస్తుంది. పునరుద్పాదక విద్యుత్ తో పాటు వన్ గ్రిడ్ వన్ నేషన్ దిశగా సహకారం అందిస్తుంది. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలకు అనుగుణంగా బడ్జెట్ రూపొందించారు. మెరుగైన జీవన ప్రమాణాలు, ఈజ్ ఆఫ్ లివింగ్ కోసం దోహదం చేసేలా బడ్జెట్ ఉంది. హైదరాబాద్-బెంగుళూరు, హైదరాబాద్-చెన్నై హైస్పీడ్ రైల్ కారిడార్ ద్వారా రాష్ట్రానికి ఉపయోగం ఉంది. తిరుపతి, అమరావతి వంటి ప్రాంతాలు ఈ హైస్పీడ్ కారిడార్ల ద్వారా అనుసంధానం అవుతాయి. బెంగుళూరు- చెన్నై హైస్పీడ్ రైల్ కారిడార్ వల్ల పలమనేరు, చిత్తూరు, తదితర ప్రాంతాలకు కనెక్టివిటి వస్తుంది. ఈ మూడు హైస్పీడ్ రైల్ కారిడార్లు ఏపీలోని వివిధ ప్రాంతాలను కవర్ చేస్తాయి. హైదరాబాద్, అమరావతి, బెంగుళూరు, చెన్నై లాంటి నగరాలు అన్ని అనుసంధానం అవుతాయి. డెడికేటెడ్ రేర్ ఎర్త్ మినరల్స్ కారిడార్లో ఏపీ కూడా ఉంది. అత్యంత విలువైన ఖనిజాలు వెలికి తీసి క్రిటికల్ ఎలక్ట్రానిక్స్ తయారీకి ఉపకరించే అవకాశం ఉంది. ఐఎస్ఎం 2.0 ద్వారా సెమీ కండక్టర్ కు రూ.40 వేల కోట్లు పెట్టారు. టెక్స్ టైల్ రంగం కూడా వృద్ధి చెందేలా బడ్జెట్ ఉంది. పర్యాటకానికి, హాస్పిటాలిటికి కూడా ప్రాధాన్యం ఇచ్చారు. అరకు రీజియన్ అభివృద్ధి అంశాన్ని కేంద్ర బడ్జెట్లో పెట్టారు. పులికాట్ సరస్సు



అభివృద్ధికి కూడా బడ్జెట్లో నిధులు కేటాయించారు. ఫ్లెమింగోలు అరుదైన పక్షులు కూడా ఆ ప్రాంతానికి ఆలవాలంగా ఉంటాయి. కోకోనట్, జీడి, కోకో, చందనం లాంటి పంటలకు అభివృద్ధికి కార్యాచరణ ప్రకటించారు. ఇవన్నీ ఏపీ అభివృద్ధికి మేలు చేసే అంశాలే." అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

**లాజిస్టిక్స్ రంగంపై కేంద్రం తొలిసారి ప్రస్తావన :** డేటా సెంటర్లకు పన్ను మినహాయింపులు 2047 వరకూ పెట్టారు. భారత్ డేటా సెంటర్ల హబ్ గా తయారవుతుంది. విశాఖకు గూగుల్ సహా వివిధ డేటా సెంటర్లు వస్తున్నాయి. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ రంగానికి ఊతమిచ్చేలా ఈ డేటా సెంటర్లు తయారవుతాయి. పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయి. 2047 వరకూ టాక్స్ హాలిడే వల్ల డేటా సెంటర్లు పెద్ద ఎత్తున దేశంలోకి విస్తరిస్తాయి. బిల్ గేట్స్ కూడా త్వరలో అమరావతిలో పర్యటించబోతున్నారు. ఏఐ, క్వాంటం, డేటా సెంటర్స్ లాంటి నెక్స్ జెన్ టెక్నాలజీస్ కు ఏపీ కేరాఫ్ అడ్రస్ గా ఉంటుంది. లాజిస్టిక్స్ రంగంపై ఏపీ పూర్తి స్థాయిలో దృష్టి సారించింది. కేంద్ర బడ్జెట్టులో తొలిసారిగా లాజిస్టిక్స్ రంగం అభివృద్ధి గురించి ప్రస్తావించారు. ఈస్ట్ కోస్ట్ కారిడార్ వల్ల లాజిస్టిక్స్ పరంగా గణనీయమైన వృద్ధి నమోదు అవుతుంది. అంతర్గత జల రవాణా కోసం బడ్జెట్లో నిధులు పెట్టారు. వెయ్యి కిలోమీటర్ల పొడవైన మన తీర ప్రాంతం అంతా గణనీయమైన వృద్ధి చెందుతుంది. లాజిస్టిక్స్ కార్పోరేషన్ ఇప్పటికే ఏర్పాటు చేశాం. పట్టణాల అభివృద్ధి, గ్రోత్ సెంటర్లకు నిధులు కేటాయించారు. విశాఖ ఆర్థిక రీజియన్, తిరుపతి గ్రోత్ రీజియన్, అమరావతి రీజియన్లు వేగంగా వృద్ధి చెందే అవకాశం ఉంది. కంటైనర్స్ ద్వారా లాజిస్టిక్స్ మరింత వేగవంతం అవుతాయి. రీజినల్ మెడికల్ హబ్స్ , ఆయుష్ హబ్స్ ఏర్పాటుకు కూడా బడ్జెట్లో నిధులు ఇచ్చారు. వీటన్నిటినీ ఇంటిగ్రేట్ చేసుకుని ఏపీ వృద్ధి చెందే అవకాశం ఉంది. సంజీవని ప్రాజెక్టు ఈ ఏడాదిలో ఓ గేమ్ చేంజర్ గా మారుతుంది. అని సీఎం అన్నారు.

**స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కు మరింత ఊతం :** వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ అనే విధానం ద్వారా ప్రతీ ఒక్కరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయి. 75 శాతం ఎంఎస్ఎంఈలకు క్రెడిట్ గ్యారెంటీ ఇచ్చేలా కేంద్రం నిర్ణయించింది... రాష్ట్రం తరపున 20 శాతం ఇస్తున్నాం. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కు వెళ్లేలా మరిన్ని సంస్కరణలు రావాలి. ఇప్పటికే జీఎస్టీ సంస్కరణలు, కార్మిక సంస్కరణలు వచ్చాయి. స్పీడ్ ఆఫ్ డూయింగ్ గవర్నెస్సు ద్వారా ఈజ్ ఆఫ్ లివింగ్ సాధ్యం అవుతుంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పాలసీలకు వెసులుబాటు కల్పించేలా బడ్జెట్ ఉంది. పూర్వోదయ ద్వారా నిధులు ఇస్తామని బడ్జెట్లో పెట్టారు. రాయలసీమను నెక్స్ట్ లెవల్ కు తీసుకెళ్లేలా మేం ప్రయత్నాలు చేస్తాం. ప్రపంచంలోనే అత్యుత్తమ ఉద్యాన క్లస్టర్ గా రాయలసీమ జిల్లాలు మారబోతున్నాయి. డీపీ వరల్డ్ లాంటి ప్రతిష్టాత్మక సంస్థలు ఇక్కడికి వస్తున్నాయి. పూర్వోదయ ద్వారా నిధులు ఇస్తామని బడ్జెట్లో పెట్టారు." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**తిరుమలపై రాజకీయం చేస్తున్నారు:** "2019-24 మధ్య జరిగిన వారసత్వంగా వచ్చిన సమస్యలు ఉన్నాయి... వాటిని పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్తున్నాం. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో నివేదిక వచ్చింది. తిరుమల పవిత్రతను కాపాడ్డానికి చర్యలు తీసుకుంటున్నాం. ఎన్డీడీబీ నివేదిక వచ్చింది... కల్తీ నెయ్యి అని ఆ నివేదిక చెప్పింది. దీనిపై సిట్ వేసి నివేదిక ఇస్తే మళ్లీ నాపై ఆరోపణలు చేసే స్థాయికి వచ్చారు. మహా ద్వారం ద్వారా వెళ్లే అవకాశం ఉన్నా... సామాన్య భక్తుడిగానే స్వామి దర్శనానికి వెళ్తున్నాను. అపచారం చేసి, మహాపాపం చేసి దానిని కప్పి పుచ్చుకోవడానికి నాపైనే తిరిగి దాడి చేస్తున్నారు. శ్రీవేంకటేశ్వరస్వామిని కూడా రాజకీయం చేస్తున్నారు." అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

# వికసిత భారతానికి ఆర్థిక క్రమశిక్షణ

**నేషనల్ బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** సుస్థిర ఆర్థిక వృద్ధితో దూసుకుపోతున్న భారత్.. అదే ఊపు కొనసాగించే చోదకశక్తిగా 2026-27 బడ్జెట్ను కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం ప్రవేశపెట్టారు వికసిత్ భారత్ దిశగా అడుగులు వేస్తున్నామని, గ్లోబల్ మార్కెట్లతో పోటీ పడుతూ ముందుకు సాగుతున్నామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. లోక్ సభలో కేంద్ర బడ్జెట్ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 9వ సారి బడ్జెట్ ప్రవేశపెట్టారు. . మూడు కర్తవ్యాలు.. ఆరు సంస్కరణలతో వికసిత్ భారత్ లక్ష్యంగా బడ్జెట్ను రూపొందించారు. ఎన్నడూ లేని రీతిలో ఈసారి రక్షణ రంగానికి అత్యధికంగా నిధులు కేటాయించారు. యువత, మహిళలు, రైతుల సాధికారత, టెక్నాలజీ, మౌలిక వసతుల అభివృద్ధి, రైల్వే, వ్యవసాయం, ఆరోగ్య రంగానికి ప్రాధాన్యత ఇచ్చారు.. ఒకే సమయంలో రెండు పనుల తరహాలో మల్టి- టాస్కింగ్ నిర్ణయాలు, ప్రకటనలు చేశారు. ఆర్థికవ్యవస్థను వేగంగా అభివృద్ధి చేస్తూనే, సామాన్యులకు కొంత ఉపశమనం కల్పించే ప్రయత్నం చేశారు. ఈ బడ్జెట్ స్వల్పకాలిక ప్రయో జనాల కన్నా దీర్ఘకాలిక వృద్ధిపై ఎక్కువ దృష్టి పెట్టింది. జాతీయ, అంతర్జాతీయ సవాళ్లకు దీటుగా బడ్జెట్లో 'స్వదేశీ మంత్రం' పఠించారు! సుంకాలకు జంకేది లేదంటూ ఆత్మ నిర్భర అస్త్రానికి పదును పెట్టారు!అధిక పన్ను కోతలు, నగదు ప్రయోజనాలను ఇవ్వడానికి బదులుగా, ప్రభుత్వం రోడ్లు, రైల్వేలు, కర్మాగారాలు, విద్యుత్, సాంకేతికత కోసం భారీగా ఖర్చు చేయాలని నిర్ణయించింది.

ఈ సారి బడ్జెట్లో ఒకే సమయంలో రెండు పనుల తరహాలో మల్టి-టాస్కింగ్ నిర్ణయాలు, ప్రకటనలు చేశారు. తక్షణంగా సామాన్యులకు అందే ప్రకటనలు కాకుండా దీర్ఘకాలిక లక్ష్యాలతో మౌలిక సదుపాయాల సృష్టికి పెద్దపీట వేస్తూ కేంద్రం కీలక ప్రతిపాదనలు చేసింది. ఒకవైపు దేశీయ అవస మరోవైపు అంతర్జాతీయ అస్థిర స్థితులను ఎదుర్కొనేలా బడ్జెట్ రూపొందించింది. ఎగుమతులు తగ్గించుకుని దేశీయంగా వ్యవస్థలను నిర్మించుకునేలా మౌలిక సదుపాయాల కల్పనకు గత పదేళ్లలో గరిష్టంగా మూలధన వ్యయాలకు రూ. 12.2 లక్షల కోట్లు కేటాయింపులు జరిపింది. ఇందులో భాగంగానే హైస్పీడ్ రైల్ కారిడార్, రేర్ ఎర్త్ కారిడార్, సెమీకండక్టర్ మిషన్ 2.0, డేటా సెంటర్ల ఏర్పాటుకు ప్రోత్సాహకాలను ప్రకటించింది. దేశీయంగా విమానాల తయారీకి, సీప్లేన్ తయారీకి ఇన్సెంటివ్లతో ప్రోత్సహించింది. లోక్ సభలో 2026-27బడ్జెట్ గురించి నిర్మలా సీతారామన్ ప్రసంగించారు. ప్రభుత్వానికి బాసటగా నిలుస్తున్న ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు. మూడు కర్తవ్యాలను లక్ష్యాలుగా ప్రకటించారు. ప్రజల ఆశయాలను అందుకోవడమే తమ లక్ష్యమని, ప్రధాని నరేంద్ర మోడీ ఆలోచనలతో ఎన్నో కొత్త సంస్కరణలు తీసుకొస్తున్నామని తెలియజేశారు. ఈ బడ్జెట్ ను యువశక్తి బడ్జెట్ గా అభివర్ణించారు. నిర్మాణాత్మక సంస్కరణలతో ఈ కార్యవ్యాలను సాధిస్తామని, ఇది యూనిక్ బడ్జెట్ అని పేర్కొన్నారు. ఆత్మ నిర్భరత వల్లే 7 శాతం గ్రోత్ ఉంటుందని అన్నారు. కర్తవ్యం1: సమ్మిళిత ఆర్థిక వృద్ధి. కర్తవ్యం 2: ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం 3: సబ్ కా సాత్, సబ్ కా వికాస్ అని తెలిపారు. ప్రభుత్వానికి బాసటగా నిలుస్తున్న ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు.

మూడు కర్తవ్యాలను లక్ష్యాలుగా ప్రకటించారు. ప్రజల ఆశయాలను అందుకోవడమే తమ లక్ష్యమని, ప్రధాని నరేంద్ర మోదీ ఆలోచనలతో ఎన్నో కొత్త సంస్కరణలు తీసుకొస్తున్నామని తెలియజేశారు. దీన్ని యువ శక్తి బడ్జెట్ గా అభివర్ణించారు. ప్రధాని మోదీ వినూత్న ఆలోచనలే ఈ బడ్జెట్‌కు మూలస్తంభాలని, ముఖ్యంగా పేదలు, అణగారిన వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. నూతనంగా నిర్మాణమైన కర్తవ్య భవన్లో రూపొందించిన మొట్టమొదటి బడ్జెట్ ఇదే అని చెప్పుకోవచ్చు. ప్రభుత్వం తన లక్ష్యాలను చేరుకోవడానికి ప్రభుత్వం ముఖ్యంగా మూడు ప్రధాన కర్తవ్యాలను నిర్ణయించుకుంది. వాటికి ఊతమిచ్చే విధంగా ఈ బడ్జెట్ లో అనేక నిర్ణయాలు తీసుకుంది. ఈ మూడు కర్తవ్యాల్లో మొదటిది దేశ ఆర్థిక వ్యవస్థను వేగంగా, నిలకడగా ముందుకు తీసుకెళ్లడం. రెండవది ప్రజల ఆకాంక్షలను గుర్తించి, వారి నైపుణ్యాలను, సామర్థ్యాలను అభివృద్ధి చేయడం. మూడవది సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్ ను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరికీ అభివృద్ధి ఫలాలను అందించడం. ఈ లక్ష్యాలను సాధించడానికి అనుకూలమైన వాతావరణం అవసరమని పేర్కొంటూ ఆర్థిక ప్రగతికి ఊతమిచ్చేలా సంస్కరణల వేగాన్ని కొనసాగించడం, మూలధన కేటాయింపులను క్రమబద్ధీకరించడం, మెరుగైన రిస్క్ మేనేజ్‌మెంట్ విధానాలను అమలు చేయడం, సుపరిపాలన అందించడానికి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ను ఇంప్లిమెంట్ చేయడం, అధునాతన టెక్నాలజీని విరివిగా ఉపయోగించడం వంటి అంశాలను ప్రస్తావించారు.

బడ్జెట్ లో మధ్య తరగతితో పాటు పేదలకు కొన్ని కీలక అంశాలను ప్రకటించారు. ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్ గడువు పొడిగింపుతో పాటు జిల్లాకో లేడీస్ హాస్టల్, మహిళల కోసం గ్రామాల్లో స్టోర్లు వంటి నిర్ణయాలు ఉన్నాయి. ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్ ఫైలింగ్ గడవును జూలై 31 వరకు పెంచారు. రిటర్న్ దాఖలులో ఏవైనా తప్పులుంటే మార్చి 31 వరకు సరిచేసుకోవచ్చు. ఇక 17 రకాల క్యాన్సర్ మందుల మీద కస్టమ్స్ డ్యూటీ తగ్గించారు. దీనివల్ల త్వరలో క్యాన్సర్ చికిత్స ఖర్చు తగ్గనుంది. ఇక భారత్ నుంచి విదేశాలకు చదువు కోసం కానీ.. టూర్ల కోసం పంపే నగదుపై కట్ అయ్యే పన్ను టీసీఎస్ ను 20శాతం నుండి 2శాతానికి తగ్గిస్తూ బడ్జెట్‌లో నిర్ణయించారు. వాహన ప్రమాదాల్లో బాధితులకు కోర్టు ద్వారా వచ్చే పరిహారం మీద వచ్చే వడ్డీకి ఇకపై ట్యాక్స్ ఉండదు. మహిళా వ్యాపారుల కోసం షీ మార్ట్స్ పేరుతో ఊర్లలో ప్రత్యేక షాపులు ఏర్పాటు చేయనున్నారు. ఐటీ ఇండస్ట్రీని దేశంలో అభివృద్ధి చేయడానిక బడ్జెట్ లో కొన్ని ప్రతిపాదనలు చేశారు. ముఖ్యంగా భారత్‌లో ఏర్పాటు చేయనున్న డేటా సెంటర్లకు కేంద్రం గుడ్ న్యూస్ ప్రకటించింది. 2047 వరకు ట్యాక్సులు కట్టాల్సిన అవసరం లేకుండా బడ్జెట్లో కీలక ప్రకటన చేశారు. విశాఖపట్నంలో గూగుల్ మెగా డేటా సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. హైదరాబాద్‌లోనూ చాలా డేటా సెంటర్లు ఏర్పాటవుతున్నాయి. కేంద్రం చేసిన ట్యాక్స్ హాలిడ్ ప్రకటనతో తెలుగు రాష్ట్రాల్లో మరిన్ని డేటా సెంటర్లు ఏర్పాటయ్యే అవకాశం ఉంది. అయితే ఈ సౌలభ్యాన్ని పొందడానికి కంపెనీలు స్థానిక రీసెల్లర్స్ ద్వారా భారత కస్టమర్లకు సేవలు అందించాలనే షరతు విధించింది. 20 ఏళ్లపాటు ట్యాక్స్ హాలీడే ప్రకటించడం ద్వారా.. విశాఖ నగరం మరింతగా డేటా సెంటర్ల కోసం పెట్టుబడులను ఆకర్షించే అవకాశం ఉంది. సముద్ర గర్భంలో కేబుల్స్ కనెక్టివిటీ ఉండటంతో విశాఖ నగరం ఇంటర్నేషనల్ డేటా కారిడార్‌గా మారనుంది.

ఇక ప్రస్తుత టెక్నాలజీ యుగానికి కీలకమైన రేర్ ఎర్త్ మినరల్స్ అన్వేషణపై ఫోకస్ పెట్టింది. కేంద్ర బడ్జెట్లో ఏపీ, ఒడిశా, తమిళనాడు,కేరళ రాష్ట్రాల్లో రేర్ ఎర్త్ మినరల్స్ కారిడార్ ఏర్పాటు చేయనున్నారు. దీని వల్ల ఏపీలో పరిశ్రమలు డెవలప్ అయ్యే అవకాశం ఉంది. ఎలక్ట్రిక్ వాహనాల్లో వాడే పర్మనెంట్ మ్యాగ్నెట్లు ఏపీలోనే తయారైతే.. ఆంధ్రప్రదేశ్ ఈవీ తయారీ హబ్‌గా మారనుంది.

వీటితో పాటు టైర్ 2 టైర్ 3 నగరాలను అభివృద్ధికోసం చిన్న పట్టణాలను డెవలప్ చేయడంపై కేంద్రం స్పెషల్ ఫోకస్ పెట్టింది. 5 లక్షల కంటే ఎక్కువ జనాభా ఉన్న పట్టణాలు, నగరాల అభివృద్ధికి కేంద్రం నిధులు అందించనుంది. దీని వల్ల తెలుగు రాష్ట్రాల్లోని విజయవాడ, విశాఖపట్నం, నెల్లూరు, గుంటూరు, కర్నూలు, వరంగల్, కరీంనగర్ తదితర నగరాలకు ప్రత్యేక గ్రాంట్లు అందనున్నాయి. టెంపుల్ సిటీలను కూడా అంతర్జాతీయ పర్యాటక కేంద్రాలుగా మార్చాలని కేంద్రం భావిస్తోంది. ప్రధాన ఆలయాలు ఉన్న పట్టణాల్లో మౌలిక వసతుల కల్పన కోసం కేంద్రం నిధులు మంజూరు చేయనుంది. దీంతో తెలుగు రాష్ట్రాల్లోని పలు టెంపుల్ టౌన్లకు కూడా గ్రాంట్లు లభించనున్నాయి.

ఇక మన దేశంలో హైస్పీడ్ రైల్ కనెక్టివిటీని పెంచేందుకు సైతం కేంద్రం నిధులను అందజేయనుంది. ఇందులో హైదరాబాద్ పేరు కూడా ఉంది. ఏడు నగరాల మధ్య హైస్పీడ్ రైల్ కారిడార్లు ప్రకటించారు. ముంబై టూ పూణె, పూణె టూ హైదరాబాద్, హైదరాబాద్ టూ బెంగుళూరు, హైదరాబాద్ టూ చెన్నై, ఢిల్లీ టూ వారణాసి, వారణాసి టూ సిలిగురి, చెన్నై టూ బెంగుళూరు మధ్య ఏడు కారిడార్లను ప్రకటించారు.

మౌలిక సదుపాయాల కల్పనకు 12.2 లక్షల కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. గతేడాది 11.2 లక్షల కోట్లు కేటాయించగా.. ఈసారి స్వల్పంగా పెంచారు. దేశ మౌలికసదుపాయాల కల్పనలో భాగంగానే ఈ కారిడార్లను నిర్మిస్తున్నామని సీతారామన్ వెల్లడించారు. వీటిద్వారా ప్రధాన ఆర్థిక, సాంస్కృతిక కేంద్రాల మధ్య అనుసంధానం పెరుగుతుందని చెప్పారు. సుదూర ప్రయాణాల విషయంలో పర్యావరణహితమైన రవాణా వ్యవస్థగా ఈ కారిడార్లు మారుతాయని ఆశాభావం వ్యక్తంచేశారు. ఇవి ప్రయాణ సమయాన్ని కుదిస్తాయని, రోడ్డు మార్గం, ఇప్పటికే ఉన్న రైలు నెట్‌వర్క్‌లో రద్దీని తగ్గిస్తాయని పేర్కొన్నారు. ఈ బడ్జెట్ లో ఆపరేషన్ సిందూర్ ప్రభావం గణనీయంగా చూపించిందని చెప్పుకోవచ్చు. భారత్‌కు ఓ వైపు పాక్.. మరో వైపు చైనా ఉండగా.. కొత్తగా ఈ శత్రుకూటమిలో బంగ్లాదేశ్ సైతం వచ్చి చేరడంతో రికార్డు స్థాయిలో రక్షణ బడ్జెట్ పెరిగింది. ఆపరేషన్ సిందూర్‌తో అత్యాధునిక టెక్నాలజీ వెపన్స్ అవసరాలను భారత్ గుర్తించింది. దీనికి తగ్గట్లే కేటాయింపులను చేసింది. గతేడాది అన్నింటికి కలుపుకొని.. 6.81లక్షల కోట్లు కేటాయించగా.. ఈ సారి అది 7.85 లక్షల కోట్లకు చేరుకొంది. ఈ సారి మొత్తం బడ్జెట్ కేటాయింపుల్లో తమకు 14.68శాతం లభించినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది.

ముఖ్యంగా రక్షణ దళాల ఆధునికీకరణకు ఈ బడ్జెట్‌లో పెద్దపీట వేసి 21.84 శాతం కేటాయింపులను పెంచారు. గతేడాది కేవలం 1.8లక్షల కోట్లనే కేటాయించగా.. ఈ సారి దానిని 2.19 లక్షల కోట్లకు చేర్చారు. ఈ బడ్జెట్‌లో ఎయిర్ ఫోర్స్ యుద్ధ విమానాల అవసరాలకు పెద్దమొత్తాన్ని కేటాయించారు. విమాన ఇంజిన్లు, ఎయిర్‌క్రాఫ్ట్‌ల కోసం 63వేల 733 కోట్లు కేటాయించారు. సైన్యం రోజువారీ కార్యకలాపాలు, వేతనాలు, ఇంధనం, రేషన్, ఆయుధాల నిర్వహణ, మందుగుండు వంటి వాటి కేటాయింపులను 17.24శాతం పెంచారు. దీంతో దళాల రోజువారీ కార్యకలాపాలు మరింత శక్తిమంతంగా మారనున్నాయి. ఇక పింఛన్ల కోసం కేటాయింపును 6.53శాతం పెంచి 1.71 లక్షల కోట్లకు చేర్చారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదంపై నిత్యం పోరాడే రాష్ట్రీయ రైఫిల్స్‌కు కూడా నిధులను పెంచారు. గత మూడేళ్లతో పోలిస్తే అత్యధికంగా 255 కోట్లు కేటాయించారు. గతేడాది 222 కోట్లు మాత్రమే ఇచ్చారు. రక్షణ రంగంలో రహస్యమైనవిగా భావించే స్పెషల్ ప్రాజెక్టులకు కూడా వెయ్యి 989.12 కోట్లు కేటాయించారు. ఇదే సమయంలో ఎయిర్ ఫోర్స్ ప్రాజెక్టులకు కేటాయింపులు స్వల్పంగా తగ్గి వెయ్యి 618 కోట్లుగా నిలిచింది.

బడ్జెట్ ద్వారా దేశ ప్రజలందరికీ గుడ్ న్యూస్ చెబుతూనే యధావిధిగా మందుబాబులకు కేంద్రం షాక్ ఇచ్చింది. ఆల్కహాల్ సెల్లర్స్, స్క్రాప్, మినరల్స్ నుంచి వసూలు చేస్తున్న ట్యాక్స్ కలెక్టెడ్ యాట్ సోర్స్ ను 2 శాతంగా నిర్ణయించింది. గతంలో ఆల్కహాల్ సెల్లర్స్, స్క్రాప్, మినరల్స్‌పై టీసీఎస్ వివిధ రకాలుగా ఉండేది. కొన్ని సార్లు చాలా ఎక్కువగా ఉండేది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో ఈ రంగాలలోని సెల్లర్స్‌కు మేలు జరగనుంది. ట్యాక్స్ సిస్టమ్ సులభతరం కానుంది. దీంతో మందుబాబులపై ఈ 2 పర్సెంట్ టాక్స్ భారం పడనుంది. కేవలం ఆల్కహాల్ రేట్లు మాత్రమే కాకుండా... సిగరెట్లు, పాన్ మసాలా, పొగాకు ఉత్పత్తులపై భారీగా ప్రభావం పడనుంది. వాటి రేట్లు పెరిగే అవకాశం ఉంది.

మొత్తంగా చూసుకుంటే కేంద్ర బడ్జెట్ దేశ ప్రజలందరికీ శుభవార్త చెబుతూనే వ్యసనపరులకు బాంబు పేల్చుతూ బడ్జెట్ ను ప్రవేపెట్టింది. దీన్ని బట్టి చూసుకుంటే.. 2047 నాటికి కేంద్రం భావించిన వికసిత్ భారత్ లక్ష్యంలో భాగంగా ముందుకు వెళ్తోందని స్పష్టమవుతోంది. అందుకుగానూ మౌలిక సదుపాయాలు, ఐటీ సంస్థలు, డేటా సెంటర్లు, ఏఐ వినియోగం, హైస్పీడ్ రైళ్లు ఇలా అన్నిటిపైనా దృష్టి పెట్టిందని చెప్పుకోవచ్చు.

**ఉచితాలకు సెలవు... :** అధిక పన్ను కోతలు, నగదు ప్రయోజనాలను ఇవ్వడానికి బదులుగా, ప్రభుత్వం రోడ్లు, రైల్వేలు, కర్మాగారాలు,సాంకేతికత కోసం భారీగా ఖర్చుచేయాలని నిర్ణయించింది. విదేశీ ప్రయాణాలు, విద్య, వైద్య సంబంధిత చెల్లింపులపై తక్కువ పన్ను వసూలు (టీసీఎస్- 2%కి తగ్గింపు), పన్ను రిటర్న్ విషయంలో దిద్దుబాటుకు ఎక్కువ సమయం వంటి చిన్న పన్ను ఉపశమనాలు ఇచ్చారు. ఇవి కాకుండా పెద్ద ఆదాయ-పన్ను ఆఫర్లేమీ ప్రకటించలేదు. ఉచితాలకూ సెలవిచ్చింది. తాయిలాలు .. రుణాల మాఫీ, కొత్త హామీలు, కేటాయింపులకు తావులేకుండా చూసుకుంది.

**మూడు కర్తవ్యాలతో బడ్జెట్ :** కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ను మూడు కర్తవ్యా లతో ప్రకటించింది. దేశ ఆర్థిక వృద్ధి స్థిరంగా సాగాలని, యువశక్తి ఆశయాలకు, అవకా శాలకు అనుగుణంగా, సామాన్య ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా ఈ బడ్జెట్ ఉంటుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న అనిశ్చిత పరిస్థితుల మధ్య దేశంలో ఉత్పాదకత, పోటీతత్వాన్ని పెంచి సుస్థిరమైన ఆర్థికాభివృద్ధి సాధించాలనేది మొదటి కర్తవ్యమైతే.. సామర్థ్య నిర్మాణం రెండో కర్తవ్యంగా నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ప్రజల ఆకాంక్షలను నెరవేరు వారి శక్తి సామర్థ్యాలను పెంపొందించి సుసంపన్న భారత్లో భాగం చేయాలని భావిస్తున్నామని నిర్మలా సీతారా మన్ అన్నారు. సబ్కా సాత్, సబ్కా వికాస్ నినాదాన్ని ప్రస్తావిస్తూ ఆర్థిక వృద్ధి పెద్ద కంపెనీలు, పెద్ద నగరాలకు మాత్రమే కాకుండా సమాజంలోని అన్ని వర్గాలకు చేరాలని, దేశంలోని ప్రతి ఒక్కరికీ వనరులు, సదుపాయాలు, అవకాశాలను అందిస్తూ అభి వృద్ధిలో భాగస్వాములుగా చేస్తామని, ఇదే మూడో కర్తవ్యమని వివరించారు.

**రక్షణకు భారీ కేటాయింపులు.. :** ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఒకవైపు ఉక్రెయిన్- రష్యా, ఇజ్రాయెల్-పాలస్తీనాల ఘర్షణలు, చైనా- తైవాన్ విషయంలో ఏం జరుగుతుందో? గ్రీన్లాండ్ అంశం మరోవైపు రగులుతున్న తరుణంలో.. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత్ రక్షణ కేటాయింపులు పెంచింది. 2026-27 బడ్జెట్ లో రూ.7,84,678 కోట్లు(గతేడాది కంటే 15 శాతం అధికంగా) రక్షణ వ్యయంగా కేటాయించినట్లు ప్రకటించారు. రక్షణ రంగానికి చెందిన యూనిట్లు విమానాల నిర్వహణ, మరమ్మతులు, ఓవర్హౌల్ (ఎంఆర్ఓ) అవసరాల కోసం ఉపయోగించే భాగాల తయారీలో వినియో గించే ముడి పదార్థాల దిగుమతులపై కూడా ప్రైమరీ కస్టమ్స్ డ్యూటీని మాఫీ చేశారు.

**ఎస్ఎంఇ రంగానికి రూ.10 వేల కోట్లు :** సెమీ కండక్టర్ మిషన్ 2.ా ప్రారంభిస్తామని, త్వరలో నేషనల్ ఫైబర్ స్కీమ్ ప్రారంభం, టెక్స్‌టైల్ రంగం అభివృద్ధికి కొత్త పథకం, దేశంలో కొత్త మెగా టెక్స్‌టైల్ పార్కుల ఏర్పాటు చేయడంతో పాటు ఖాదీ, హ్యాండ్లూమ్, హస్తకళల ప్రోత్సాహానికి పథకం ఏర్పాటు చేస్తామని, అత్యంత నాణ్యత కలిగిన క్రీడా వస్తువుల తయారీకి పథకం ఉంటుందని, 200 పారిశ్రామిక క్లస్టర్స్ ఆధునీకరణకు చేయూతనిస్తామన్నారు. ఆత్మనిర్భర్ భారత్‌కు రూ.2 వేల కోట్లు కేటాయించడంతో పాటు ఎస్ఎంఇ రంగానికి రూ.10 వేల కోట్లు ఇస్తామని, మైక్రో సెక్టార్‌కు రూ.2 వేల కోట్లు ఇస్తామని, ఆత్మనిర్భర్ భారత్‌కు రూ.2 వేల కోట్లు ఇస్తామని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.

**రెండో, మూడో స్థాయి నగరాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు :** నగరాలే దేశ గ్రోత్ ఇంజిన్లు అని, రెండో, మూడో స్థాయి నగరాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, పాట్నా, వారణాసిల్లో షిప్ రిపేర్ ఎకోసిస్టమ్, ఏడు హైస్పీడ్ రైల్ కారిడార్ల అభివృద్ధితో పాటు ముంబై- పుణే, పుణే-హైదరాబాద్, హైదరాబాద్- చెన్నై రూట్లలో హైస్పీడ్ రైల్ కారిడార్లు నిర్మించడంతో పాటు ఢిల్లీ- వారణాసి, వారణాసి- సిలిగురి మార్గాల్లో హైస్పీడ్ రైల్ కారిడార్ ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు.

**రూ.10,000 కోట్లతో కంటైనర్ పథకం :** వచ్చే ఐదేళ్లలో కంటైనర్ తయారీని ప్రోత్సహించేందుకు రూ. 10,000 కోట్ల బడ్జెట్ కేటాయింపుతో ఒక పథకాన్ని ఆర్థికమంత్రి నిర్మల ప్రతిపాదించారు. పర్యావరణ పరంగా స్థిరమైన కార్గో తరలింపును ప్రోత్సహించేందుకు, అధికంగా విలువైన, ఆధునిక సాంకేతిక విలువలతో కలిగిన కంటైనర్ లను దేశీయంగా తయారీకి, మౌలిక సదుపాయాల మెరుగుదలకు ఈ పథకాన్ని ప్రవేశపెట్టనున్నట్లు మంత్రి ఆదివారం బడ్జెట్ ప్రతిపాదనల సందర్భంగా చెప్పారు.

## ఆర్టీసీ ఎండీకి ఇ.యు ఘన వీడ్కోలు



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):**ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ , మేనేజింగ్ డైరెక్టర్‌గా నాలుగు సంవత్సరాల ఎనిమిది నెలల పాటు సేవలందించిన సి. హెచ్. ద్వారకా తిరుమలరావుకు ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ఘన వీడ్కోలు పలికింది. శనివారం పదవీ విరమణ సందర్భంగా విజయవాడలోని ఆర్టీసీ హౌస్‌లో యూనియన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి సన్మానించారు.రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 129 డిపోలు, నాలుగు వర్క్‌షాప్‌లను సందర్శించి, క్రింది స్థాయి ఉద్యోగులతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇచ్చారని నేతలు గుర్తుచేశారు. పీటీడీ ఉద్యోగుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపుతూ సంస్థను ముందుకు నడిపించడంలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'స్త్రీ--శక్తి' పథకం విజయవంతం కావడంలోనూ ఆయన సేవలు విశేషమని తెలిపారు.

సంస్థకు, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావడంలో ఆయన కృషి మరువలేనిదని ఇ.యు నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో ఇ.యు రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. వి. నరసయ్య, డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎం.డి. ప్రసాద్‌తో పాటు రాష్ట్ర, జోన్, జిల్లా నాయకులు, మహిళా నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంబటి వ్యాఖ్యలపై మండిపడ్డ తెలుగు నాడు ఉపాధ్యాయ సంఘం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):**ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలను తెలుగు నాడు ఉపాధ్యాయ సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సంఘం ఒక ప్రకటన విడుదల చేసింది.రాష్ట్ర ముఖ్యమంత్రిని ఉద్దేశించి పరుష పదజాలంతో వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని సంఘం పేర్కొంది. పత్రికల్లో కూడా రాయలేని స్థాయిలో దూషణాత్మక పదాలు ఉపయోగించడం బాధాకరమని, ఇలాంటి వ్యాఖ్యలు సమాజంలో తప్పుడు సందేశాన్ని పంపుతాయని తెలిపింది.

రాజకీయ విమర్శలు నిర్మాణాత్మకంగా ఉండాలి గానీ, వ్యక్తిగత దూషణలుగా మారకూడదని స్పష్టం చేసింది. సభ్య సమాజం తలదించుకునేలా బహిరంగంగా వ్యాఖ్యలు చేయడం సరికాదని పేర్కొంటూ, అంబటి రాంబాబు తన వ్యాఖ్యలపై బేషరతుగా బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది.

ఈ ప్రకటనను సంఘం అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకటేశ్వర్లు విడుదల చేశారు.

## అంబటి వ్యాఖ్యలపై ఆంధ్రా పెన్షనర్స్ పార్టీ ఆగ్రహం

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):**రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన అభ్యంతరకర, అన్‌పార్లమెంటరీ వ్యాఖ్యలను ఆంధ్రా పెన్షనర్స్ పార్టీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు సుబ్బరాయన్ పాలంకి ఒక ప్రకటన విడుదల చేశారు.

సభ్య సమాజం సిగ్గుతో తలదించుకునేలా ముఖ్యమంత్రిపై బూతు పదాలతో దూషించడం అత్యంత ఖండనీయమని ఆయన పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా తెలుగు జాతి గౌరవాన్ని పెంచి, ఆంధ్రప్రదేశ్‌కు పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చిన నాయకుడిపై ఈ విధమైన వ్యాఖ్యలు చేయడం యావత్ ఉద్యోగులు, పెన్షనర్ల మనోభావాలను దెబ్బతీసిందన్నారు.

అంబటి రాంబాబును వెంటనే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. చేసిన తప్పును ఒప్పుకుని బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని, ప్రజల ఎదుట తలవంచి మన్నించమని కోరాలని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే అంబటిపై చర్యలు తీసుకుని అరెస్టు చేయాలని పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు. క్షమాపణలు చెప్పకపోతే ప్రజలు సహించరని హెచ్చరించారు.

## సీఎం చంద్రబాబుకి అంబటి బహిరంగ క్షమాపణ చెప్పాల్సిందే



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై అంబటి రాంబాబు చేసిన అసభ్య పదజాలం అత్యంత దారుణమని, దీనికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ధ్వజమెత్తారు. ఆదివారం ఢిల్లీలో ఎంపీ కృష్ణదేవరాయలు మాట్లాడారు. మంత్రి హోదాను నిర్వహించిన వ్యక్తి ఇలా నడుచుకోవడమనేది వైయస్సార్ పార్టీ సంస్కృతికి నిదర్శనం. దూషించే వారికి, దోచి పెట్టే వారికే పార్టీలో ఎదుగుదల, పదవులు అనే విచిత్ర సంస్కృతి వైసీపీలో ఉందని, అధిష్టానం గత ప్రభుత్వంలో ఇలాంటి వారినే హోదాల్లోకి తీసుకున్నారనేది వారి కార్యకర్తలు, నాయకులు చెప్పుకుంటున్న మాటలని అన్నారు. తిడితేనో, జైలుకెళ్తేనో గుర్తింపు వస్తుంది, సానుభూతిని పొందాలని వైసిపి నాయకులనుకుంటే అదంతా తప్పే, ప్రజలు గమనిస్తూనే ఉన్నారు, వారు క్షమించరు. చెత్త పనులు, చెత్త వాగుడు వాగిన వారికి 2024 లో ప్రజలే గట్టిగా బుద్ధి చెప్పారు, అయినా వారిలో మార్పు రావటం లేదు. రాజకీయాల్లో ఉన్నప్పుడు నాయకులు హుందాగా నడుచుకోవాలి, ఏది ధర్మం? ఏది న్యాయం? ఆలోచించుకొని ఇది కరెక్టేనా అని మాట్లాడాలి. అలాగే ప్రజలు కూడా తప్పు చేసే వారిని క్షమిస్తూ, సానుభూతి చూపిస్తూ, జేజేలు కొట్టినంత కాలం ఈ విపరీత ధోరణికి మార్పు రాదు అనే విషయాన్ని గుర్తుంచుకోవాలని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



**మైదుకూరు(జర్నలిస్ట్ ఫైల్):** మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో 16 వార్డు నందు అభివృద్ధిలో భాగంగా సుమారు 7.50 లక్షల రూపాయల వ్యయంతో సీసీ రోడ్డు మరియు డ్రైనేజీ నిర్మాణానికి ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు దాసరి బాబు, 16వ వార్డు కౌన్సిలర్ బి.ఎన్. నాగేశ్వరి, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ యాపరాలచిన్న, ధనపాల్ జగన్, బురుగోళ్ల చిన్నధనపాల రవి, బి ఎన్ శ్రీనివాసులు, బండి అమర్నాథ్, తుపాకుల రమణ తదితరులు పాల్గొన్నారు.

# కోర్టుల్లో వల్నరబుల్ విట్నెస్ డిపోజిషన్ సెంటర్లు ఏర్పాటు చేయాలి



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :**లైంగిక నేరాల బాధితులు, పిల్లలు, బెదిరింపుల మధ్య ఉన్న సాక్షులు మళ్లీ మానసిక వేదనకు గురికాకుండా, వారి వాంగ్మూలాలను సురక్షితమైన, భద్రమైన, పిల్లల అనుకూల వాతావరణంలో నమోదు చేసేందుకు అన్ని కోర్టుల్లో వల్నరబుల్ విట్నెస్ డిపోజిషన్ సెంటర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు ఆఫ్ ఇండియా నియమించిన వల్నరబుల్ విట్నెస్ కమిటీ చైర్‌పర్సన్ జస్టిస్ గీతా మిట్టల్ స్పష్టం చేశారు.

సుప్రీంకోర్టు నియమించిన వల్నరబుల్ విట్నెస్ కమిటీ, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు వల్నరబుల్ విట్నెస్ సెంటర్ల కమిటీ సహకారంతో ఆదివారం గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని ఎస్.ఆర్. శంకరన్ హాల్‌లో న్యాయాధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి జస్టిస్ గీతా మిట్టల్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పిల్లలు, వికలాంగులు, దుర్వినియోగానికి గురైన బాధితులు వంటి వల్నరబుల్ సాక్షులకు అనుకూలమైన కోర్టు వాతావరణాన్ని కల్పించడమే కమిటీ లక్ష్యమని చెప్పారు. స్క్రీన్లు, అనువాదకులు, విరామాలు, సహాయక వ్యక్తులు వంటి ప్రత్యేక చర్యలను వినియోగించి, నిందితుడి హక్కులకు భంగం కలగకుండా న్యాయమైన వాంగ్మూలం అందేలా చూడాలని పేర్కొన్నారు.

సాక్షులు నిందితులను ఎదుర్కోకుండా ప్రత్యేకంగా వేచి ఉండే గదులు, వీడియో కాన్ఫరెన్స్ గదులు, సహాయక వ్యక్తుల వినియోగం, నిందితులతో ముఖాముఖి కలవకుండా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ప్రధాన కోర్టు ప్రాంతానికి దూరంగా, పిల్లలకు అనుకూలంగా బొమ్మలు, ఆటవస్తువులు, పుస్తకాలు ఉండే విధంగా అన్ని వయస్సుల వారికి తగిన ప్రత్యేక గదులు ఏర్పాటు చేయాలని తెలిపారు. సాక్షుల భద్రత కోసం ప్రత్యేక ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు ఉండాలని అన్నారు.

వాంగ్మూలం సమయంలో తల్లిదండ్రులు, సంరక్షకులు లేదా కౌన్సిలర్ వంటి నియమిత సహాయక వ్యక్తి సాక్షితో పాటు ఉండవచ్చని చెప్పారు. సాక్షుల పేరు, చిరునామా, పాఠశాల లేదా గుర్తింపు వివరాలు ఎట్టి పరిస్థితుల్లోనూ బయటపెట్టకుండా కఠినంగా నిషేధించాలని ఆమె స్పష్టం చేశారు.

న్యాయమూర్తులు, కౌన్సిలర్లు సహా సిబ్బంది అంతా పిల్లలు, లైంగిక దాడి బాధితులు వంటి వల్నరబుల్ వ్యక్తులతో వ్యవహరించే తీరుపట్ల తగిన శిక్షణ పొందాలని ఆమె తెలిపారు. దర్యాప్తు లేదా తీర్పు సమయంలో సరళమైన, అర్థమయ్యే భాషను ఉపయోగించాలని, అవసరమైతే అనువాదకులు, సంకేత భాష నిపుణులు, ప్రత్యేక ఉపాధ్యాయులను వినియోగించాలని సూచించారు. ప్రశ్నలు అర్థం చేసుకునే సామర్థ్యంపై దృష్టి పెట్టి, మానసిక వేదనను తగ్గిస్తూ, నిరంతర సహాయాన్ని అందించాలని పేర్కొన్నారు. సాక్షుల హక్కులు, నిందితుడికి న్యాయమైన విచారణ హక్కు మధ్య సమతుల్యత ఉండాలని ఆమె నొక్కి చెప్పారు.

ప్రతి ఒక్కరికీ సమానత్వం, న్యాయానికి చేరువ కల్పించాలనే చట్ట బద్ధతను పాటించాలని న్యాయాధికారులను ఆమె కోరారు. వల్నరబుల్ సాక్షులు సివిల్ లేదా క్రిమినల్ కేసుల్లో, కుటుంబ వివాదాల్లో, కస్టడీ వివాదాల్లో, లైంగిక దుర్వినియోగ బాధితులుగా, పితృత్వ కేసుల్లో, జువెనైల్ జస్టిస్ బోర్డుల ముందు, చిల్డ్రన్స్ కోర్టుల్లో హాజరవుతారని ఆమె తెలిపారు.

వి డబ్ల్యూ డి సిల వినియోగం క్రిమినల్ కేసులకే కాకుండా సివిల్ కేసులు, కుటుంబ కోర్టులు, జువెనైల్ జస్టిస్ బోర్డులు, చిల్డ్రన్స్ కోర్టుల వంటి ఇతర న్యాయ విభాగాలకు కూడా అనుమతించాలన్నారు. అన్ని న్యాయ విభాగాల్లో వల్నరబుల్ సాక్షుల వాంగ్మూలాల రికార్డింగ్‌కు అనుమతి ఇవ్వాలని ఆమె సూచించారు.

పిల్లలు పలు ఇంటర్వ్యూలు ఎదుర్కోవడం, ట్రయల్‌కు ముందు దీర్ఘకాలం వేచిచూడటం, కోర్టు ఆలస్యాలు, నిందితుడిని ఎదుర్కోవడం, క్లిష్టమైన న్యాయ భాషలో ప్రశ్నలు, అవసరం లేని ప్రశ్నలు, నిజాయితీగా ఇచ్చిన సమాధానాలను నమ్మశక్యం కానివిగా చూపించడం వంటి కారణాల వల్ల పూర్తి స్థాయిలో తమ వాంగ్మూలాన్ని ఇవ్వలేకపోతున్నారని ఆమె అన్నారు.

అనుచిత ప్రశ్నలు, న్యాయవాదుల అడ్డంకులు, పెద్దలు ఎలా సమాధానం చెప్పాలనే సూచనలు, సాక్షులను ఇబ్బంది పెట్టేలా రూపొందించిన క్రాస్ ఎగ్జామినేషన్, అనుమతికి సంబంధించిన పరిమితులు, కథనాలను మార్చుకోవాల్సిన పరిస్థితులు, మానసిక వేదన వల్ల ప్రక్రియ ఆలస్యం కావడం వంటి సమస్యలను ఆమె వివరించారు. నేరస్తుడిని ఎదుర్కోవడం, హింసాత్మక అనుభవాలను మళ్లీ చెప్పుకోవడం, దూషణాత్మక క్రాస్ ఎగ్జామినేషన్ వల్ల ద్వితీయ మానసిక గాయాలు కలుగుతున్నాయని చెప్పారు.

దర్యాప్తు నుంచి తీర్పు వరకు వివిధ దశలలో పాటించాల్సిన మార్గదర్శకాలను అనేక న్యాయ తీర్పులు నిర్దేశించాయని, వాటిని పోలీసులు, వైద్యులు, మేజిస్ట్రేట్లు తప్పనిసరిగా పాటించాలని ఆమె తెలిపారు. ఈ మార్గదర్శకాలు ఐక్యరాజ్యసమితి మార్గదర్శకాలు, అంతర్జాతీయ పత్రాలు, భారతదేశంలోని చట్టాలు, అలాగే న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, కెనడా, దక్షిణాఫ్రికా, యూకే, యూఎస్ఏ, ఫిలిప్పీన్స్ వంటి దేశాల న్యాయ తీర్పుల ఆధారంగా రూపొందించబడ్డాయని ఆమె చెప్పారు.

ఈ అన్ని అడ్డంకులను అధిగమించేందుకే వల్నరబుల్ విట్నెస్ కోర్ట్‌రూమ్‌లను ఆలోచించి అమలు చేస్తున్నామని జస్టిస్ గీతా మిట్టల్ తెలిపారు. కోర్టుకు ముందు సందర్శన, కోర్టు హాజరు, వాంగ్మూలం, క్రాస్ ఎగ్జామినేషన్ సమయంలో న్యాయ మూర్తులు నాయకత్వం చూపుతూ సాక్షులతో నేరుగా మమేకం కావాలని, గౌరవంతో వ్యవహరించాలని, ప్రశ్నలు న్యాయంగా, వయస్సుకు తగినట్లుగా ఉండాలని, సాక్షుల గౌరవం, ఆత్మగౌరవం మొత్తం ప్రక్రియలో కాపాడాలని ఆమె సూచించారు.

గుంటూరు విచ్చేసిన జస్టిస్ గీత మిట్టల్‌కు జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ పుష్ప గుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర వల్నరబుల్ విట్నెస్ డిపోజిషన్ సెంటర్ల కమిటీ అధ్యక్షులు జస్టిస్ జి. రామకృష్ణ ప్రసాద్, న్యాయ మూర్తులు జస్టిస్ ఆర్. రఘునందన రావు, జస్టిస్ వి. సుజాత, జస్టిస్ ఎస్. సమత, జస్టిస్ వి. గోపాల కృష్ణ, జస్టిస్ కిరణ్మయి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి. కళ్యాణచక్రవర్తి, ఇతర జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు, న్యాయ అధికారులు, పోలీస్ అధికారులు సరిత, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో 72 లక్షల మందికి వైద్య పరీక్షలు

- **రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దటమే లక్ష్యం**
- **సంజీవని ప్రాజెక్టు సహకారంపై త్వరలో రాష్ట్రానికి బిల్ గేట్స్ రాక**
- **కుప్పంలోని తుమ్మిశిలో ప్రజల డిజిటల్ హెల్త్ రికార్డులు పరిశీలించిన సీఎం చంద్రబాబు**



**కుప్పం(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రవ్యాప్తంగా 72 లక్షల మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి హెల్త్ ప్రొఫైల్స్ రూపొందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దటమే లక్ష్యంగా పనిచేస్తున్నామని సీఎం వెల్లడించారు. కుప్పం నియోజకర్గం శాంతిపురం మండలం తుమ్మిశి గ్రామంలోని విలేజ్ హెల్త్ క్లినిక్ ను ముఖ్యమంత్రి సందర్శించారు. ఆ గ్రామంలోని ప్రజల డిజిటల్ హెల్త్ రికార్డులను స్వయంగా పరిశీలించారు. సంజీవని ప్రాజెక్టు అమలు గురించి ప్రజలతో ముఖాముఖి మాట్లాడి వివిధ అంశాలను తెలుసుకున్నారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి వైద్యారోగ్య శాఖ రూపొందించిన డిజిటల్ హెల్త్ రికార్డుల ద్వారా వివిధ అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న వారి నుంచి సమాచారం తెలుసుకున్నారు. వారి ఆరోగ్యాన్ని మెరుగు పర్చేందుకు నిపుణులైన వైద్యులతో పాటు ఔషధాలను ఇచ్చేలా సంజీవని ప్రాజెక్టు ఉపయోగపడుతుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అత్యుత్తమ టెక్నాలజీ ద్వారా ప్రజల ఆరోగ్య అంశాలను పర్యవేక్షించేలా ఈ ప్రాజెక్టు చేపట్టామని వివరించారు. బిల్ గేట్స్ ఫౌండేషన్, టీసీఎస్ సహకారంతో ఈ డిజినెర్వ్ సెంటర్ ద్వారా ప్రతీ ఒక్కరి డిజిటల్ హెల్త్ రికార్డులను తయారు చేస్తున్నామని తెలిపారు. సంజీవని ప్రాజెక్టు అమలుతో పాటు మరిన్ని రంగాల్లో సహకారం అందించేందుకు త్వరలోనే బిల్ గేట్స్ రాష్ట్రానికి రానున్నారని సీఎం వివరించారు. కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన సంజీవని చిత్తూరు జిల్లాకు విస్తరించామని .. ఈ ఏడాదిలోనే రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేలా కార్యాచరణ చేపడుతున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆస్పత్రుల్లో నమోదు అయిన వైద్య పరీక్షల వివరాలను డిజిటల్ గా మార్చామని అన్నారు. ప్రజల ఆరోగ్య సమస్యలను విశ్లేషించి చికిత్సలు అందించేలా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న వారికి నిపుణులైన వైద్యుల ద్వారా వారికి చికిత్స చేయించడంతో పాటు ఔషధాలు ఇస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. సంజీవని సేవల్ని సమర్ధంగా వినియోగించుకోవాలని సీఎం ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కుప్పం నియోజకవర్గంలో 80 వేల మంది హెల్త్ రికార్డులను తయారు చేశామని ఆయన వెల్లడించారు.

**ఆరోగ్యపరమైన అంశాలపై స్కోరింగ్ :** వైద్య పరీక్షల అనంతరం వ్యక్తుల ఆరోగ్యానికి సంబంధించి స్కోరింగ్ కూడా ఇచ్చేలా చర్యలు చేపడతామని సీఎం వివరించారు. 42 రకాలైన వైద్య పరీక్షలు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేశామన్నారు. డయాబెటిస్, బీపీ, అనీమియా, హృద్రోగం తదితర అనారోగ్య సమస్యలకు సంబంధిత వైద్య నిపుణులతో ఔషధాలను ఇప్పించటంతో పాటు ప్రజారోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షిస్తామని అన్నారు. త్వరలో వైద్య సలహాల కోసం ఏఐ డాక్టర్ సేవలను కూడా అందుబాటులోకి తీసుకువచ్చే ఆలోచన చేస్తున్నామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. డిజినెర్వ్ సెంటర్ ద్వారా ఒక్క క్లిక్ తోనే వైద్యులు రోగులకు సంబంధించిన వివరాలన్నీ తెలుసుకునేందుకు అవకాశం ఉందన్నారు. సంజీవని ప్రాజెక్టు ద్వారా నమోదు చేసిన తుమ్మిశి గ్రామస్థుల డిజిటల్ హెల్త్ రికార్డులను వారి ఆరోగ్య వివరాలను పరిశీలించిన ముఖ్యమంత్రి కొందరు అనీమియా లోపంతో బాధపడుతున్న మహిళలు, ఇతర అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న వారితో ముఖాముఖి మాట్లాడి వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. వారికి మెరుగైన చికిత్స అందించటంతో పాటు వైద్య నిపుణుల సేవలు అందేలా చూడాలని వైద్యారోగ్య శాఖను ఆదేశించారు. తుమ్మిశి గ్రామంలో ఇటీవల గుండెపోటు తో మృతి చెందిన ఓ వ్యక్తి కుటుంబానికి సీఎం సహాయ నిధి నుంచి రూ.3 లక్షల సాయాన్ని ముఖ్యమంత్రి ప్రకటించారు.

## అంబటి వ్యాఖ్యలు చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారు



- **రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ సంస్థ చైర్మన్ మన్నవ విమర్శ**
- **నీచమైన భాష ప్రయోగిస్తే తెదేపా సహించదు**

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :**ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై వైసీపీ నేత అంబటి రాంబాబు చేసిన అసభ్యకర, అవమానకర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు గుంటూరు అరండల్‌పేటలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పలురు తెదేపా నాయకులు మాట్లాడారు. మీడియా సమావేశంలో పాల్గొన్న.ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ మాట్లాడుతూ.. అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలు రాజకీయ విమర్శలు కావని, అవి నీచమైన వ్యక్తిగత దూషణలు మాత్రమేనని తీవ్రంగా మండిపడ్డారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై అసభ్య పదజాలంతో మాట్లాడటం అంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవంపై నేరుగా చేసిన దాడేనని స్పష్టం చేశారు. అంబటి రాంబాబు గత 32 సంవత్సరాల్లో ఒక్కసారి మాత్రమే గెలిచాడు, అంటే నిన్ను ప్రజలు ఎంత అసహ్యించుకుంటున్నా రో తెలుస్తోందన్నారు.. నీలాంటి వాళ్లు రాజకీయాలకు అనహురులని, నీలాంటి సైకోలని నడిపోస్తున్న పెద్ద సైకో బెంగళూరు ప్యాలస్ లో ఉంటూ మీ అందరికి చేత ఇలాంటి పనులు చేపిస్తున్నాడని ధ్వజమెత్తారు. చంద్రబాబు నాయుడు నాయకత్వాన్ని దూషించడం వల్ల వైసీపీ చేసిన అవినీతి, విధ్వంస పాపాలు ఎప్పటికీ కడగబడవని మన్నవ మోహనకృష్ణ స్పష్టం చేశారు.

## నేడు ప్రజా సమస్యలు పరిస్కార వేదిక

**మైదుకూరు (జర్నలిస్ట్ ఫైల్):**మైదుకూరు తహసిల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం రెవిన్యూ క్లినిక్ నిర్వహిస్తున్నట్లు తహసిల్దార్ రాజసింహ నరేంద్ర తెలిపారు. మండల స్థాయి అధికారులు అందరు పాల్గొంటారని తెలిపారు ప్రజలు పరిష్కారం కోసం వినతులు తాసిల్దార్ కార్యాలయంలో సమర్పించవచ్చని అన్నారు. ప్రజల వినతులు కడపజిల్లాకేంద్రంకు వెళ్లకుండా రెవిన్యూ డివిజన్ అధికారి కలెక్టర్ గారికి స్థానిక కార్యాలయం నుండే ఆన్లైన్లో నమోదు చేసి పంపడం జరుగుతుందన్నారు. కావున మైదుకూరు మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## గుండె పోటుతో రైతు మృతి

**బ్రహ్మంగారి మఠం జర్నలిస్ట్ ఫైల్ :** బ్రహ్మంగారిమఠం మండలంలోని బొగ్గులవారిపల్లి గ్రామానికి చెందిన గొడ్లవీటి రామ్మోహన్(43) శనివారం తీవ్ర ఛాతి నొప్పి ఉందని కుటుంబ సభ్యులకు తెలియజేయగా వాళ్ళు వెంటనే తిరుపతి రమాదేవి హాస్పిటల్ కి తరలించారు డాక్టర్స్ అతన్ని పరీక్షించి దారి మధ్యలో గుండెపోటుతో మరణించారు అని తెలిపారు మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు కలరు.

## కేంద్ర బడ్జెట్ తో ప్రతి రంగానికి,ప్రతి పౌరుడికి సాధికారత



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ పార్లమెంట్ 2026-2027 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ప్రవేశపెట్టారు. దీనిపై అధికారంలో ఉన్న బీజేపీ ప్రశంసలు కురిపిస్తే కాంగ్రెస్ పార్టీ విమర్శలు కురిపిస్తోంది. తాజాగా బడ్జెట్ పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పందించారు. ఎక్స్ లో అమిత్ షా.. ఈ బడ్జెట్ ద్వారా ప్రధానమంత్రి మోడీ స్వావలంబన మరియు అభివృద్ధి చెందిన భారతదేశం కేవలం నినాదం కాదని, ప్రభుత్వ సంకల్పం అని నిరూపించారన్నారు. ఈ బడ్జెట్ ప్రతి రంగానికి, ప్రతి తరగతికి మరియు ప్రతి పౌరుడికి సాధికారత కల్పించడానికి స్పష్టమైన బ్లూప్రింట్‌ను అందించిందన్నారు. అంతే కాకుండా ప్రతి అడుగులో వారికి సహాయపడే ప్రోత్సాహాన్ని అందించడానికి ఒక పునాది దార్శనికతను కూడా అందిస్తుందని పేర్కొన్నారు. #ViksitBharatBudget అనేది ప్రతి రంగంలోనూ ప్రపంచ అగ్రస్థానంలో ఉండే భారతదేశాన్ని నిర్మించడానికి ఒక దార్శనికత అని కొనియాడారు.

# పేద ప్రతిభగల విద్యార్థులకు ఆర్థిక చేయూతనిచ్చే ఉపకార వేతనాలు

- **కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్"**
- **ట్రస్టు ఆధ్వర్యంలో ఉపకార వేతనాల పంపిణీ**



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :**గుంటూరు నగరం, ఆర్.అగ్రహారం లోని రామనామ క్షేత్రం ప్రాంగణంలో ఆదివారం ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమం కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్ ట్రస్టు ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. కార్యక్రమంలో అతిథులు, కృష్ణదేవరాయ ట్రస్ట్ సభ్యుల చేతుల మీదుగా 270 మంది విద్యార్థులకు రూ. 12.12 లక్షలు చెక్కుల రూపంలో ఉపకారవేతనాలను అందజేశారు..

తొలుత జ్యోతి ప్రజ్వలన అనంతరం వందేమాతర గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. సభాధ్యక్షత వహించిన తులసి రామచంద్ర ప్రభు మాట్లాడుతూ తాను చదువుకునే రోజులలో కేవలం రూ16 పదో తరగతికి పరీక్ష ఫీజు కట్టలేని గడ్డు పరిస్థితిని ఎదుర్కొన్నానని, బీటెక్ ఇంటర్ చదివే రోజుల్లో గవర్నమెంట్ నుంచి వచ్చిన రూ450 ఉపకారవేతనాలతో చదువుకొని జీవితంలో స్థిరపడ్డాక మరలా తిరిగి సమాజానికి ఇవ్వాలనే ఉద్దేశంతో 1995-96 లో ఇద్దరు విద్యార్థులతో మొదలుపెట్టి నేటికి సుమారు 40 వేల మంది విద్యార్థులకు రూ.23 కోట్ల ఉపకార వేతనాలుగా కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్ ట్రస్టు ద్వారా పంపిణీ చేసినట్లు ఆయన సభా ముఖంగా తెలియజేశారు. దీనికి మేజర్ కాంట్రిబ్యూషన్ తులసి సీడ్స్ సమకూరుస్తుందని దానితో పాటుగా గుంటూరు నగరంలోని కొంతమంది సమాజ హితం కోరే పెద్దలు ఈ కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్ ట్రస్టులో సభ్యులుగా చేరి సహాయ సహకారాలు అందిస్తున్నారని దాని ద్వారానే పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్నామని వారి సహకారం మరువలేనిదని ఆయన తెలియజేశారు.

విద్యార్థులందరూ కూడా ఉన్నత స్థితికి వచ్చిన తర్వాత సమాజ హితం కోసం ఇదే విధంగా సేవా కార్యక్రమాలు జరిపి భరతమాత రుణం తీర్చుకోవాలని ఆయన కోరారు. మీరు భవిష్యత్ లో ఏమి కావాలనుకుంటున్నారో ఈ క్షణమే నిర్ణయం తీసుకోవాలని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. తామిచ్చే ఉపకారవేతనాలు దానం లేదా సహాయం అని తాము అనుకోవడం లేదని ,భవిష్యత్ లో వారు చేయబోయే దేశసేవకు పెట్టుబడిగా మాత్రమే భావిస్తున్నామని అయన అన్నారు. ఏటుకూరి మాజీ సర్పంచ్ ఉగ్గిరాల సీతారామయ్య మాట్లాడుతూ ఎవరి స్వార్థం వారు చూసుకునే ఈ రోజుల్లో తులసి రామచంద్ర ప్రభు స్వయంగా సంపాదించిన డబ్బుతో నిస్వార్థంగా కొన్ని కోట్ల రూపాయలను పేద విద్యార్థులకు ఉపకారవేతనాల రూపంలో పంచి పెడుతున్న తులసి రామచంద్రప్రభు వంటి వ్యక్తులు సమాజంలో చాలా అరుదుగా ఉంటారని వారి ఆశయాన్ని అర్థం చేసుకుని వారు అందించే ఈ సహాయాన్ని సద్వినియోగం చేసుకుని ప్రతి ఒక్కరూ కష్టపడి చదువుకుని జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకొని సమాజానికి మేలు చేయాలని కోరారు. ఎటువంటి ప్రత్యక్ష రాజకీయాలలో లేకపోయినా యువతకు విద్య, ఉద్యోగ విషయాలలో తోడ్పడుతూ, ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడినప్పుడు, వారి సహాయార్థమై ప్రభుత్వానికి లక్షల రూపాయలను వెచ్చిస్తూ, ఇంకా ఎన్నో రకాలుగా ప్రభు ప్రజాసేవ చేస్తున్నారని ప్రతి రాజకీయ నాయకుడు కూడా వారిని స్ఫూర్తిగా తీసుకుని ప్రజాసేవ చేయాలని బళ్ళా నరేంద్ర తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. అలాగే రైతులు నష్టపోకూడనే సదుద్దేశంతో తులసి సీడ్స్ పత్తి విత్తన సంస్థను స్థాపించి రైతులకు ఎంతో ఉపయోగ పడ్డారన్నారు. విద్యార్థులందరూ కష్టపడి చదివి, మంచి ఉద్యోగాలు సంపాదించుకుని తల్లిదండ్రుల అండగా నిలవాలని కోరారు. గుంటూరు సర్వజనాసుపత్రికి, మెడికల్ కళాశాల బస్సులకు రూ. కోట్ల విరాళంగా ఇవ్వడం చాలా గొప్ప విషయమని ప్రభుని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో ముందుగా ట్రస్ట్ సభ్యులను రామచంద్ర ప్రభు పుష్పగుచ్ఛాలతో శాలువాలతో సత్కరించారు. తదుపరి అందరు కలిసి తులసి రామచంద్ర ప్రభు , సతీమణి అరుణ చేసిన సేవలను కొనియాడుతూ సన్మానించారు . ఈ కార్యక్రమంలో కొందరు ట్రస్ట్ కు తమ విరాళాలను అందజేశారు. కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ ఉ అండర్ ప్రివిలేజ్డ్ ట్రస్ట్ నారదాసు శ్రీహరిరావు, పుర ప్రముఖులు తోట శంకరరావు, తిమ్మిశెట్టి నారాయణరావు, పసుపులేటి రమణయ్య, అంకిరెడ్డి సాంబశివరావు, నారదాసు కోటేశ్వరరావు, పుచ్చకాయల ఆనంద్, కనదం నరేంద్రనాథ్, దళావాయి సుబ్రహ్మణ్యం, మిరియాల శ్రీనివాస్,, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# కుష్టు వ్యాధి ప్రాణంతకం కాదు, నయమౌతుంది

## కుష్టు వ్యాధి ప్రాణంతకం కాదు , నయమౌతుందని వైద్యులు తెలిపారు



ఫిబ్రవరి 01 (జర్నలిస్ట్ ఫైల్) : :నంద్యాల జిల్లా ప్రతినిధి.: ఆంధ్రప్రదేశ్ వాలంటరీ హెల్త్ అసోసియేషన్ సహకారంతో స్టార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యం లో శుక్రవారం వెలుగోడు పట్టణం లోని ఎంపీడీఓ ఆఫీస్ నందు ప్రపంచ కుష్టు వ్యాధి నివారణ దినోత్సవం నిర్వహించడం జరిగినది.మహాత్మా గాంధీ వర్ధంతి సందర్బంగా గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ కుష్టు వ్యాధి బాక్టీరియా వల్ల వస్తుందని, ఇది చర్మం మరియు నరాల పై ప్రభావం చూపిస్తుందని ఈ వ్యాధి తెలిసిన వెంటనే చికిత్స తీసుకుంటే అత్యంత ప్రమాదం కాదని అందుకు తగిన అవగాహనా చాలా అవసరం అని తెలుపడం జరిగింది. సమావేశం అనంతరం ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డా. జహీర్ వలి డా. నజీర్ అహ్మద్ , హెల్త్ సూపర్ వైజర్లు శ్రీదేవి , ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసులు , స్టార్ యూత్ అసోసియేషన్ ప్రోగ్రామ్ ఆఫీసర్ .ఖాదర్ వలి, మేరీబా స్వచ్ఛంద సంస్థ ఏ.ఒ జుల్ఫికర్, మహేశ్వరీ , ఏ ఎన్ ఎం లు మరియు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# ప్రతిభకు ఘనమైన వేడుక : మాంట్‌ఫోర్ట్ ఫియెస్టా



ఖమ్మం, ఫిబ్రవరి 01 (జర్నలిస్ట్ ఫైల్) : ఖమ్మం నగరంలో గల గుట్టల బజార్ ఏరియా లోని మాంట్ ఫోర్ట్ హై స్కూల్లో విద్యా రంగానికి చిరస్థాయిగా నిలిచిన సంస్థ స్థాపకులు సెంట్ లూయిస్ మాంట్ ఫోర్ట్ 353వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించ బడ్డాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి, సెంట్ లూయిస్ మాంట్ ఫోర్ట్ సేవలు, ఆయన విద్యా తత్వం, నైతిక విలువలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ఆయన ఆశయాలను ప్రతిబింబించారు. పాఠశాల యాజమాన్యం బ్రదర్ జాన్ పాల్ మాట్లాడుతూ మాట్లాడుతూ విద్యతో పాటు విలువలను పెంపొందించడమే మాంట్ ఫోర్ట్ ముఖ్య లక్ష్యమని, ఆ ఆదర్శాలను కొనసాగించేందుకు మాంట్ ఫోర్ట్ స్కూల్ కట్టుబడి ఉందని తెలిపారు. పాఠశాల వార్షికోత్సవ వేడుక, సెంట్ లూయిస్ మాంట్ ఫోర్ట్ జయంతి సర్వతో ముఖాభివృద్ధిని ప్రతిబింబించేలా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, గీతాలు నిర్వహించ బడాయి. విద్యా, క్రీడా, సహపాఠ్య కార్యకలాపాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు, మెరిట్ సర్టిఫికెట్లు ప్రదానం, మరింత ఉన్నత స్థాయికి చేరేందుకు పూర్వ విద్యార్థులకు సన్మానం, వివిధ విభాగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన హౌస్‌కు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీ అందజేశారు. ఈ వేడుకల్లో బ్రదర్ జోష్, బ్రదర్ థామస్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, పేరెంట్స్, అధిక సంఖ్యలో పూర్వ విద్యార్థుల బ్యాచ్ ఆర్ జే సి కృష్ణ, అర్లప్ప, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# రాజకీయ కక్ష సాధింపు తో కేసీఆర్ కు నోటీసులు

## కేసీఆర్ జోలికి వస్తే కాంగ్రెస్ కు
## ప్రజలే తగిన గుణపాఠం చెపుతారు : మాజీ ఎంపీ నామ
## మున్సిపల్ ఎన్నికల వేళ ప్రజా సమస్యల నుంచి దృష్టిని మళ్లించేందుకు
## కేసీఆర్ కి సిట్ నోటీసులు : మాజీ ఎంపీ నామ



ఖమ్మం, హైదరాబాద్, (జర్నలిస్ట్ ఫైల్) : బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్)కు మరోసారి నోటీసులు జారీ చేయడంపై బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్షనేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తీవ్రంగా స్పందించారు. ఈ సందర్భంగా నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ రాజకీయ కక్ష సాధింపు లో భాగంగానే సిట్ పేరుతో కేసీఆర్ ప్రతిష్టను దెబ్బతీయాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం వరుసగా నోటీసులు జారీ చేస్తోందని ఆరోపించారు. కేసీఆర్ విచారణకు సహకరించబోనని ఎక్కడా చెప్పలేదని, కేసీఆర్ చట్టాన్ని గౌరవించే నాయకుడని, విచారణ కు పూర్తిగా సహకరిస్తానని చెప్పారని, తాను నివాసం ఉంటున్న ఎర్రవల్లి లో విచారణ జరపాలని కోరారని అయితే ఏకపక్షంగా తిరస్కరించారని విమర్శించారు. మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఎన్నికల సమయం లో ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లించేందుకు ఇలాంటి వ్యవహారాలు చేస్తున్నారని, తెలంగాణ ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని స్పష్టం చేశారు. కేసీఆర్ నాయకత్వంపై ప్రజలకు పూర్తి నమ్మకం ఉందని, ఇలాంటి చర్యలతో బీఆర్ఎస్ పార్టీని గానీ, కేసీఆర్ ను గానీ బలహీనపర్చలేరని నామ ధీమా వ్యక్తం చేశారు. చట్టపరంగా ఎదుర్కొంటూనే, ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగు తుందని ఆయన తెలిపారు.

# మహిళా భద్రత' రోడ్డు ప్రమాదాలు సైబర్ క్రైమ్ పై అవగాహన



(జర్నలిస్ట్ ఫైల్) : నంద్యాల జిల్లా ప్రతినిధి: మహిళా భద్రత' సైబర్ క్రైమ్, ఈవ్ టీజింగ్ , రహదారి ప్రమాదాలు, మాదకద్రవ్యాల దుర్వినియోగం మొదలగు వాటిపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్న నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాలమేరకు వెలుగోడు మండలం లో పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సి. ఐ సురేష్ కుమార్ రెడ్డి , ఎస్. ఐ సురేష్ మాట్లాడుతూ సమాజంలో మహిళల భద్రత, మరియు పోక్సో చట్టం యొక్క ప్రాముఖ్యత గురించి వివరిస్తూ బాలికలు ఎదుర్కొనే మానసిక, శారీరక వేధింపుల పట్ల జాగ్రత్తలు ఎలా తీసుకోవాలో వివరించారు. అలాగే సైబర్ క్రైమ్, సోషల్ మీడియా దుర్వినియోగం, రోడ్డు ప్రమాదాలు మరియు ఆన్‌లైన్ భద్రత విషయాలపై వారికి విస్తృతమైన అవగాహన కల్పించారు. మొబైల్, సోషల్ మీడియా వేదికల ద్వారా వచ్చే ప్రమాదాలను గుర్తించటం, అనుమానాస్పద లింకులు లేదా అనుచిత సందేశాలు వచ్చినప్పుడు వెంటనే పోలీస్ సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. చిన్న వయస్సులో జరిగే బాల్యవివాహాల వల్ల కలిగే మానసిక, శారీరక, సామాజిక నష్టాలపై ఉదాహరణలతో వివరించడం జరిగింది. బాలికలు తమ విద్యను పూర్తి చేసుకుని స్వతంత్రంగా ఎదగడం ఎంత ముఖ్యమో వారికి స్పష్టంగా వివరించారు. పోలీస్ అధికారులు సూచించిన రోడ్డు భద్రత మరియు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వాటిని ఉల్లంఘించి రోడ్డు ప్రమాదాలకు గురై జీవితం అంధకారం చేసుకోకూడదని అవగాహన కల్పించారు. పోలీస్ విభాగం తరపున మహిళలకు ఎప్పుడు, ఎక్కడ అవసరం అయినా రక్షణ అందించడానికి పోలీసులు సిద్ధంగా ఉన్నారని తెలియజేశారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, సైబర్ మోసాల గురించి వివరించారు. ఇలాంటి ఆపద సమయాల్లో తక్షణ సహాయం కోసం అందుబాటులో ఉన్న ముఖ్యమైన హెల్ప్‌లైన్ నంబర్ల గురించి విద్యార్థులకు వివరించారు. చైల్డ్ లైన్ 1098 (పిల్లల రక్షణ మహిళ వేధింపులు 1091, సైబర్ నేరాల టోల్ ఫ్రీ 193, మాదకద్రవ్యాల దుర్వినియోగానికి సంబంధించి 1972, పై నంబర్లకు కాల్ చేసి సహాయం పొందవచ్చు అన్నారు.

## మావి చేతల పనులు
## పదేళ్ల దొరల పాలనలో పేదలకు ఒరిగింది శూన్యం
## కమిషన్ల కక్కుర్తితో కట్టిన కాళేశ్వరం ఏమైందో చూడండి
## ఏదులాపురం ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ పార్టీ పై మంత్రి పొంగులేటి ఘాటు విమర్శలు

# ప్రత్యర్థులవి 'సొల్లు కబుర్లు'



ఏదులాపురం మున్సిపాలిటీ, ఫిబ్రవరి01(జర్నలిస్ట్ ఫైల్): "ఎన్నికలు రాగానే ప్రత్యర్థులు మీ ముందుకు వచ్చి 'సొల్లు కబుర్లు' చెబుతారు. మాయమాటలతో మభ్యపెట్టే ప్రయత్నం చేస్తారు. కానీ, పదేళ్లు



అధికారంలో ఉండి పేదవాడికి ఒక ఇల్లు కూడా ఇవ్వని వారు ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని ఓట్లు అడుగుతారు?" అని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి బీఆర్ఎస్ పార్టీ పై నిప్పులు చెరిగారు. శనివారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 3, 4, 5, 6, 25వ వార్డుల్లో ఆయన విస్తృతంగా పర్యటించి ఎన్నికల శంఖారావం పూరించారు.

### అకౌంట్లు నింపుకోవడమే గత పాలకుల ధ్యేయం

ప్రచార సభల్లో మంత్రి పొంగులేటి పదేండ్ల బీఆర్ఎస్ పాలనపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "గత దొరల పాలనలో పేదలు అనేక ఇబ్బందులు పడ్డారు. ఆనాటి పాలకులు తమ అకౌంట్లు నింపుకోవాలని చూశారే తప్ప, సామాన్యుల సంక్షేమాన్ని గాలికొదిలేశారు. లక్షల కోట్ల ప్రజాధనాన్ని కుమ్మరించి, కేవలం కమిషన్ల కోసం కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు నేడు కళ్లముందే కూలిపోతోంది. ఇది వారి అవినీతికి నిదర్శనం కాదా?" అని ప్రశ్నించారు. రెండు సార్లు అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను వంచించిన చరిత్ర వారిదని ఎద్దేవా చేశారు.

### చేతల ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యం

తాము అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే మాటను నిలబెట్టుకున్నామని మంత్రి స్పష్టం చేశారు. "మేము మాటలు చెప్పేవాళ్లం కాదు. పనిచేసే వాళ్లం. రాష్ట్రవ్యాప్తంగా రూ. 22,500 కోట్లతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టాం. అర్హులైన ప్రతి పేదవాడికి ఇళ్ల స్థలంతో పాటు రూ. 5 లక్షల సాయం అందిస్తాం" అని భరోసా ఇచ్చారు. ఉచిత బస్సు ప్రయాణం, రూ 500లకే గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలు క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయని, ఇవే తమ ప్రభుత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు.

### ఏదులాపురానికి కొత్త హంగులు

ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రానికే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతానని మంత్రి పునరుద్ఘాటించారు. "వచ్చే వర్షాకాలం నాటికి మున్నేరు రక్షణ గోడను పూర్తి చేసి ప్రజల కష్టాలు తీరుస్తాం. ఎఫ్.సి.ఐ గోడౌన్ తరలింపుతో పాటు ఇక్కడ అన్ని రకాల మౌలిక



వసతులు కల్పిస్తాం. మీ కష్టం తెలిసిన మీ పెద్ద కొడుకుగా నేను మీకు అండగా ఉంటా" అని హామీ ఇచ్చారు. విపక్షాల సొల్లు కబుర్లను నమ్మకుండా, అభివృద్ధిని కాంక్షిస్తూ హస్తం గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఎంపీ వద్దిరాజు కుటుంబ సభ్యులతో కలిసి సమ్మక్క, సారలమ్మలకు ప్రత్యేక పూజలు

మేడారం, ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తన కుటుంబ సభ్యులతో కలిసి మేడారం సమ్మక్క, సారలమ్మలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఎంపీ రవిచంద్ర తన ధర్మపత్ని,





మేడారం సమ్మక్కసారలమ్మ ఆలయ ట్రస్ట్ బోర్డు మెంబర్ విజయలక్ష్మీ, కూతురు డాక్టర్ గంగుల గంగాభవాని, కుమారుడు నిఖిల్ చంద్ర,మనవళ్లు గంగుల సనవ్, గంగుల సౌరవ్ తదితరులతో కలిసి మేడారం మహాజాతర సందర్భంగా అమ్మ వార్లను దర్శించుకున్నారు.ఎంపీ రవిచంద్ర తన కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో పాటు శనివారం తెల్లవారు జామున సమ్మక్క, సారలమ్మలను దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర- విజయలక్ష్మీ పుణ్య దంపతులు, వారి కూతురు గంగా భవాని, కుమారుడు నిఖిల్ చంద్ర, మనవళ్లు సౌరవ్, సనవ్ తదితరులు అమ్మ వార్లకు నిలువెత్తు బంగారం సమర్పించి తమ మొక్కు చెల్లించుకున్నారు.

### తెలంగాణ సుభిక్షంగా వర్ధిల్లాలి : ఎంపీ వద్దిరాజు

తెలంగాణ రాష్ట్రం,ప్రజలు పాడి పంటలు, శాంతి సౌభాగ్యాలతో వర్థిల్లాలి అని, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు నిండూ నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని ఎంపీ వద్దిరాజు



రవిచంద్ర సమ్మక్క, సారలమ్మలను వేడుకున్నారు.

### రవిచంద్ర- విజయలక్ష్మీ పుణ్య దంపతులను సత్కరించిన మంత్రి సీతక్క

పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి,మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర,ఆయన ధర్మపత్ని,ఆలయ ట్రస్ట్ బోర్డు మెంబర్ విజయలక్ష్మీలను ఘనంగా సన్మానించారు. కమాండ్ కంట్రోల్ సెంటరులో మంత్రి సీతక్క రవిచంద్రను శాలువాతో,ఆయన సతీమణి విజయలక్ష్మీకి చీరను బహుకరించి సత్కరించారు.అలాగే,ఆలయ కార్య నిర్వహణాధికారి వీరాస్వామి ఎంపీ రవిచంద్రకు శాలువా కప్పి, విజయలక్ష్మీకి చీరను బహుకరించి సన్మానించారు.

### మాజీ మంత్రి తలసాని కుటుంబ సభ్యులను విందుకు ఆహ్వానించిన ఎంపీ రవిచంద్ర

మేడారం మహాజాతర సందర్శనకు విచ్చేసిన మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్,ఆయన కుటుంబ సభ్యులు, బంధుమిత్రులను ఎంపీ రవిచంద్ర విందుకు ఆహ్వానించారు.రెండేళ్లకు



ఒకసారి జరిగే ఈ మహాజాతర సందర్భంగా ఎంపీ రవిచంద్ర తన కుటుంబ సభ్యులతో కలిసి బంధుమిత్రులు, అభిమానులు, శ్రేయోభిలాషులకు విందు ఏర్పాటు చేస్తుండడం తెలిసిందే.ఈ సందర్భంగా వద్దిరాజు కుటుంబ సభ్యులు,తలసాని కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి విందు ఆరగించారు. అంతా కలిసి ఫోటోలు దిగారు.ఎంపీ రవిచంద్ర తన అన్న వద్దిరాజు కిషన్, తమ్ముళ్లు వద్దిరాజు వెంకటేశ్వర్లు,వద్దిరాజు శ్రీనివాస్,కుమారులు వద్దిరాజు శ్రీనివాస్, వద్దిరాజు నాగరాజు, వద్దిరాజు నిఖిల్ చంద్ర, మిత్రుడు వెంకటేశ్వర్లు (గోల్డ్ వెంకన్న) తదితరులను తలసానికి పరిచయం చేశారు.

# ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులను సన్మానించిన పోలీస్ కమిషనర్



ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులకు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పూలమాలలు, శాలువలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా వివిధ విభాగాలలో భాద్యతయుతమైన విధులు నిర్వహించి పోలీస్ శాఖ కు ఎనలేని సేవలందించారారని పోలీస్ కమీషనర్ కొనియాడారు. విధినిర్వహణలో తోడ్పాటు అందించిన కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు. పదవి విరమణ చేసిన మీరు ఇకపై కుటుంబ సభ్యులతో అనందంగా వారి భావి జీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు.

### ఉద్యోగ విరమణ పొందిన వారు

డి. రామయ్య (ఎస్సై) ఏ.గోపి (ఏఆర్ఎస్సై) ఏస్కె. యాకుబ్ పాషా (ఏఆర్ఎస్సై) పి.శాంతారెడ్డి (ఏఆర్ హెడ్ కానిస్టేబుల్) జి. వెంకన్న (హోంగార్డ్ పిఎల్ సి ) ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ రామానుజం,అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ ప్రసాద్ రావు, ఏసీపీ సుశీల్ సింగ్ , ఆర్ ఐ శ్రీశైలం,నాగుల్ మీరా పోలీస్ అసోసియేషన్ ఇంచార్జి అధ్యక్షుడు వేంకటేశ్వర్లు, ఏఆర్ ఎస్ ఐ లక్ష్మణరావు ఖమ్మం జిల్లా హోం గార్డ్ సంక్షేమ సంఘం అధ్యక్షులు బంక శ్రీను, సభ్యులు సి హెచ్ నాగరాజు తదితలు పాల్గొన్నారు.

# వన దేవతలను దర్శించుకున్న శెట్టి

ఖమ్మం, మేడారం, (జర్నలిస్ట్ ఫైల్) : గత 40 సంవత్సరాలుగా మేడారం అమ్మవార్లను దర్శించుకున్న సీనియర్ కాంగ్రెస్ నాయకులు శెట్టి రంగారావు. కొలువై ఉన్న సమ్మక్క సారక్క అమ్మ వార్ల ని దర్శించుకుని శనివారం మొక్కులు చెల్లించుకున్నారు. మూడు రోజుల పాటు జరిగిన మేడారం జాతరను దర్శించుకున్న కోట్లాది ప్రజలకు అధికారులకు నిరంతరం కృషి చేసిన సిబ్బందికి కలకాలం సుఖశాంతులు కలగాలని ఆ వనదేవతల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు.

## ఘనంగా ఉద్యోగుల సంఘం క్యాలెండరు ఆవిష్కరణ కార్యక్రమం



రంపచోడవరం, (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రంలో ఎస్సి, ఎస్టీ, బీసీ, మైనారిటీ, విశ్రాంతి ఉద్యోగులు, టీచర్స్, కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా జాయింట్ యాక్షన్ కమిటీ పనిచేస్తుందని ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కేతా శ్రీనివాస అన్నారు. శనివారం రాష్ట్ర కో-చైర్మన్ డ్వామా ఎపిడి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ఆధ్వర్యంలో జేఏసీ రాష్ట్ర నాయకులు సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ అధికారి, పోలవరం జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ రాజ్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. సందర్భంగా ఉద్యోగ సంఘం క్యాలెండర్ ను జేఏసీ ప్రతినిధుల కోరిక మేరకు పిఓ ఆవిష్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు కేతా శ్రీనివాస మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన పోలవరం జిల్లాలో ఆదివాసీల సంక్షేమానికి, గిరిజన ప్రాంత అభివృద్ధికి ఉద్యోగ జేఏసీ కృషి చేస్తుందని అన్నారు. త్వరలో నూతనంగా ఏర్పడిన పోలవరం జిల్లాలో నూతన కమిటీ ఏర్పాటు చేస్తామని అధ్యక్షులు కేతా శ్రీనివాస అన్నారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు బోండ్ల వరప్రసాద్, వెంకటేశ్వరావు, బి.హెచ్ మహాల్సక్ష్మి, డి.వి.బిఎస్.ఎన్ మూర్తి, అడ్వకేట్ చింతపర్తి రాంబాబు, బండారు శ్రీనివాస తదితరులు పాల్గొన్నారు.

## ఆర్.ఎం.పిలు నిబంధనలు పాటించాలి - డిప్యూటీ డి.ఎం.హెచ్.ఓ డాక్టర్ వి. మల్లేష్



**మైదుకూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** మైదుకూరు నియోజకవర్గ పరిధిలోని చాపాడు మైదుకూరు మరియు కాజీపేట మండలాలకు చెందిన ఆర్.ఎం.పి వైద్యులతో డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ వి. మల్లేష్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆర్.ఎం.పిలకు పలు కీలక సూచనలు మరియు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో డాక్టర్ మల్లేష్ మాట్లాడుతూ ఆర్.ఎం.పిలు తమ పరిమితులకు లోబడి మాత్రమే వైద్య సేవలు అందించాలని నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముఖ్యంగా జ్వరాలు ప్రబలుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో బాధితులకు సొంతంగా వైద్యం చేసి సమయాన్ని వృథా చేయవద్దని తీవ్రమైన లక్షణాలు ఉన్న రోగులను వెంటనే ప్రభుత్వ ఆసుపత్రులకు రిఫర్ చేయాలని సూచించారు.

నియోజకవర్గ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వైద్య ఆరోగ్య శాఖకు సహకరించాలని ఆయన కోరారు. ప్రజలకు మెరుగైన ప్రాథమిక ఆరోగ్య అవగాహన కల్పించడంలో ఆర్.ఎం.పిల పాత్ర బాధ్యతాయుతంగా ఉండాలని అధికారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ డి. వెంకటేశ్వర్లు చాపాడు మైదుకూరు కాజీపేట మండలాల వైద్యులు పాల్గొన్నారు.

## మన గ్రామం మన సంస్కృతి బృందం చేబ్రోలు పర్యటన



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :**ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ ప్రతినిధుల బృందం ఆదివారం గుంటూరు జిల్లాలోని చేబ్రోలును సందర్శించారు. భారత దేశ గ్రామీణ ప్రాంతాలలోని మన చరిత్ర, సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షిస్తూ, వాటి వివరాలు ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంచేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన "మన గ్రామం- మన సంస్కృతి" కార్యక్రమం అమలు తీరుతెన్నులను బృందం పరిశీలించారు.

ఈ కార్యక్రమ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రవీంద్ర, చేబ్రోలు గ్రామ కార్యదర్శి శ్రీనివాసరావులు ఇంటాక్ బృందానికి కార్యక్రమాన్ని గురించి, చేబ్రోలులో గల వారసత్వ సంపదను గురించి వివరించారు. ఈ సందర్భంగా ఇంటాక్ ఆంధ్రప్రదేశ్ సమన్వయకర్త సింగం లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ "మన గ్రామం-మన సంస్కృతి" కార్యక్రమం పురాతన భారతీయ కళలను, సంస్కృతిని, చరిత్రను కాపడటానికి ఎంతో ఉపయోగకరమని అన్నారు. ముఖ్యంగా దేశంలోని యువతకు మన ప్రాంచీన సాంప్రదాయాల గొప్పతనాన్ని ఈ కార్యక్రమం చాటిచెబుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఇంటాక్ సభ్యులు జాస్తి వీరాంజనేయులు, విజయ్ కుమార్, వేణు, ముదిగోండ రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కల్పనలకు సమగ్ర సంస్కరణలు



**కాకుమాను, (జర్నలిస్ట్ ఫైల్ ):**దేశంలో ఉపాధి కల్పనలకు సమగ్ర సంస్కరణలు తీసుకువచ్చే విధంగా బడ్జెట్ ప్రకటన ఉందని భారతీయ జనతా పార్టీ మైనారిటీ మోర్చా ఆంధ్ర కోస్టల్ జోన్ ఇంచార్జ్ డా షేక్ అబ్దుల్ ఖుద్దుస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని రంగాలకు ఊతం ఇచ్చేలా ఉన్నదని తెలిపారు. ప్రధానంగా ట్రాన్స్పోర్ట్, రక్షణ రంగం, గ్రామీణభివృద్ధి, హోం శాఖ, వ్యవసాయం, విద్య, వైద్య ఆరోగ్యం, పట్టణభివృద్ధి, ఐటీ టెలికామ్, వాణిజ్యం, పరిశ్రమాలకు అభివృద్ధి కొరకు కేటాయింపులు జరిగినట్లు తెలిపారు. దేశంలో అన్ని రంగాలు అభివృద్ధి చేసే లక్ష్యంతో ప్రభుత్వం ఉందన్నారు. దేశంలో అన్ని రంగాల అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఆమోదయోగ్యమైన రీతిలో బడ్జెట్ ప్రవేశపెట్టారని తెలిపారు.

## అంబటిపై పీడీ యాక్ట్ ప్రయోగించాలి : ఎమ్మెల్యే నసీర్

- ఐటీ సెక్షన్లు 67, 66E నమోదు చేయాలి
- రాంబాబు పూర్తి నేరస్వభావం కలిగిన వ్యక్తి
- ప్రజాస్వామ్యంలో ఉండటానికి పనికిరాడు
- సీఎంపై వ్యాఖ్యలు పూర్తి కుట్రపూరితం
- వైసీపీవన్నీ డైవర్షన్ పాలిటిక్స్
- ఎస్పీ వకుల్ జిందాల్ కు వినతిపత్రం అందించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అంబటి రాంబాబుపై వెంటనే పీడీ యాక్ట్ ప్రయోగించాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ కోరారు. ఈ మేరకు ఆదివారం కూటమి నాయకులతో కలిసి గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ను వారి కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం విలేకర్లతో ఎమ్మెల్యే నసీర్ మాట్లాడారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు పక్కా ప్రణాళికాయుతంగా వైసీపీకి చెందిన నాయకులు అంబటి రాంబాబు, జోగి రమేష్, ఇతర కేడర్ వ్యవహరిస్తున్నారని తెలిపారు. కొన్ని సంవత్సరాలుగా వైసీపీ తప్పులు చేసినప్పుడల్లా డైవర్షన్ పాలిటిక్స్ కోసం పదే పదే కుట్రపూరితంగా మాట్లాడుతున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్, కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, శాసనసభ్యుల గురించి ఇష్టమొచ్చిన రీతిలో అంబటి వ్యాఖ్యలు చేస్తూ ఉండటం వెనుక కుట్ర దాగి ఉందని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా ఇదే తరహా విధానంతో ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో పడేసేలా అంబటి రాంబాబు మాట్లాడుతుండటం కేవలం ఉద్దేశ పూర్వకమైనదేనని వివరించారు. ఇక్కడ ముఖ్యమంత్రి నారా చంద్రబాబుపై అంబటి రాంబాబు దురహంకార వ్యాఖ్యలు చేసిన వెంటనే, మరో చోట జోగి రమేష్, ఇంకో చోట మరో వైసీపీ నాయకుడు రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారన్నారు. దీని వెనుక జగన్ ఉండి నడిపిస్తుంటారని పేర్కొన్నారు. పోలీసులు శనివారం జరిగిన ఉదంతాన్ని దృష్టిలో ఉంచుకుని మాత్రమే కేసులు పెట్టారని, కానీ అంబటి రాంబాబు పదే పదే నేరాలకు పాల్పడేటువంటి పూర్తి నేర స్వభావం కలిగిన వ్యక్తి అని వివరించారు. ఈ క్రమంలో అంబటి రాంబాబుపై పీడీ యాక్ట్ తోపాటు ఐటీ సెక్షన్లు 678, 66జు కింద కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని, శాంతి భద్రతలను కాపాడాలని ఎస్పీని కోరినట్లు తెలిపారు. కులాల మధ్య చిచ్చు పెట్టేలా కూడా అంబటి తీరు ఉందన్నారు. తాను వంగవీటి రంగా గారితో పోల్చుకుంటున్నారని, స్వర్గీయ రంగా ప్రజా నాయకులని, అంబటి జగన్ మోచేతి నీళ్లు తాగే దుర్మార్గులని పేర్కొన్నారు. ప్రజా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అంబటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని, లేదంటే ప్రైవేటు కేసు వేసి తగిన బుద్ధి చెబుతామని స్పష్టం చేశారు. జగన్ నీచ కుట్రలకు తెలుగుదేశం పార్టీ కేడర్ కొంచెం కూడా బెదరదని హెచ్చరించారు.

## ఉన్నత భారత్ అభియాన్ సర్వే విజయవంతం



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్) :** ఉన్నత భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళగిరి నిర్మల ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో దుగ్గిరాల మండలంలోని చిలువూరు గ్రామంలో నాలుగో రోజు గ్రామ సర్వే శనివారం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉన్నత భారత్ అభియాన్ సెల్, జాతీయ సేవా పథకం సంయుక్తంగా చేపట్టాయి. సర్వే ప్రారంభ కార్యక్రమంలో గ్రామ సెక్రటరీ మొగిలి శరత్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడి, సర్వే మార్గదర్శకాలు, సూచనలు తెలియజేశారు. అనంతరం సర్వే నిర్వహిస్తున్న బృందాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ చిలువూరు మాణిక్యం, గ్రామ పార్టీ ప్రెసిడెంట్ తోటకూర సీతారామయ్య, మండల పరిషత్ ప్రెసిడెంట్ షేక్ జబీనా, ఎంపీటీసీ మరియు రోజమ్మ, మాజీ జడ్పీటీసీ యేళ్ల జయలక్ష్మి, టీడీపీ నాయకులు యడ్ల రామారావు, షేక్ నిజాముద్దీన్, చిలువూరు శేషగిరి, పినపాటి కరుణాకర్, మేళం ఆనంద్, పేరూరి సత్యనారాయణ, స్వర్ణ గ్రామ సిబ్బంది, గ్రామ పెద్దలు హాజరై విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఉదయం సర్వే మార్గదర్శకాలతో ప్రారంభమైన కార్యక్రమంలో ఆరోగ్యం, పరిశుభ్రత, పశుసంపద, సస్టైనబుల్ అగ్రికల్చర్ సిస్టం, రూరల్ ఎనర్జీ సిస్టం, ప్రభుత్వ పథకాలు, గ్రామ సమస్యలపై ఇంటింటి సర్వే నిర్వహించారు. సేకరించిన వివరాలు గ్రామ అభివృద్ధి ప్రణాళికకు ఉపయోగపడతాయని నిర్వాహకులు తెలిపారు.

అదేవిధంగా ఉన్నత భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యం, జీవిత లక్ష్యాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులను ఉత్సాహపరిచినందుకు పాఠశాల హెచ్ఎం డి. సత్యనారాయణ నిర్మల ఫార్మసీ కళాశాల విద్యార్థులను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కృష్ణవేణి, స్టూడెంట్ కోఆర్డినేటర్లు జి. హర్షవర్ధన్, భార్గవి, జెస్సీ, ఎం. హరినాథ్, సి. హెచ్. నాగేశ్వరరావు, ఎం. రవి పాల్గొని విద్యార్థి బృందాలకు బాధ్యతలు నిర్వహించారు. కార్యక్రమానికి సహకరించిన దుగ్గిరాల ఎంపీడీవో ఏ. శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు, నిర్మల ఫార్మసీ కళాశాల యాజమాన్యానికి ఉన్నత భారత్ అభియాన్ కోఆర్డినేటర్ డా. రేఖా నరేష్ బాబు కృతజ్ఞతలు తెలిపారు. ఉన్నత భారత్ అభియాన్ ముఖ్య లక్ష్యం ఉన్నత విద్యా సంస్థలను గ్రామీణ భారతదేశంతో అనుసంధానించడం ద్వారా స్థానిక వనరులతో స్థిరమైన అభివృద్ధిని సాధించడమని, సాంకేతికత, జ్ఞానాన్ని ఉపయోగించి గ్రామీణ జీవనోపాధిని పెంపొందించి గ్రామ స్వరాజ్యం దిశగా అడుగులు వేయడమే లక్ష్యమని ఆయన తెలిపారు.

## భారత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):**భారత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలొ జెవిఎమ్ హాస్పటల్ సహకారంతొ ఏర్పాటు చేసిన వైద్యశిబిరం ద్వారా, ఉచిత వైద్యసేవలతొపాటు మందులుపంపిణీ చేసినట్లు భారత్ ఫౌండేషన్ నిర్వాహకులు,జిఎస్టి జాయింట్ కమీషనర్ యడ్ల శ్రీలీల పేర్కొన్నారు. మండలంలోని కొలకలూరు గ్రామం, జడ్పీ పాఠశాలలో, తెలంగాణ జిఎస్టీ జాయింట్ కమీషనర్ శ్రీలీల తండ్రి,యడ్ల కాళీవరప్రసాద్ 4వ,వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం భారత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలొ, గుంటూరు జెవిఎమ్ హాస్పటల్ సహకారంతొ ఏర్పాటు చేసిన వైద్య శిబిరం ద్వారా,కీళ్ళ నెప్పులు, ఈఎన్ టి,చర్మవ్యాధుల సమస్యలకు, స్త్రీల అనారోగ్య సమస్యలకు, జర్నల్ సర్జన్ విభాగాలలొ, నిపుణులైన డాక్టర్లు,ఉచిత వైద్యసేవలు అందించారు. అవసరమైన వారికి మందులు కూడా ఉచితంగా పంపిణీ చేసారు. ఈసందర్భంగా తెలంగాణ జిఎస్టీ జాయింట్ కమీషనర్ యడ్ల శ్రీలీల మీడియాతొ మాట్లాడుతు కుటుంబ సభ్యులతొ కలిసి, స్వగ్రామంలొ, తండ్రి పేరిట సామాజిక ఉచిత వైద్యసేవలు ఏర్పాటు చేయడం ద్వారా ఎంతో మందికి వైద్యం చేరువ చేయడం సంతృప్తిగా ఉందన్నారు. ఈకార్యక్రమంలొ తన్నీరు సుబ్బారావు, వల్లూరు వరపరసాద్, ఉగ్గిరాల సీతారామయ్య, డాక్టర్ కోటి నాగయ్య, డాక్టర్ లక్ష్మి,జెవిఎమ్ హాస్పటల్ వైద్య సిబ్బంది, పెద్ద సంఖ్యలొ గ్రామస్తులు పాల్గొన్నారు.

## దినచర్యలా సేవను అలవర్చుకుందాం



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్) :** మనకున్నదానిలొ ఎంతో కొంత తోటివారి కోసం వినియోగించే విధానం ప్రతి ఒక్కరు అలవర్చు కోవడం ద్వారా మెరుగైన సమాజం పరిడవిల్లుతుందని మహాత్మా సేవా శాంతి ఆశ్రమం వ్యవస్థాపకులు వజ్రాల రామలింగాచారి, యోగా సభ్యులు ముద్దాబత్తుని సాంబశివరావు సేవా స్పూర్తిని ప్రశంశించారు. స్థానిక బుర్రిపాలెం రోడ్ లోని ఏ ఎస్ ఎన్ మహిళ ఇంజనీరింగ్ కళాశాల, మహాత్మ సేవా శాంతి ఆశ్రమంలో, యోగా సభ్యులు ముద్దబత్తుని సాంబశివరావు 61వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని, ఆశ్రమ వృద్ధులకు అన్నదాన సేవలు నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో తులత మహాత్మా గాంధీ పీఠం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, వృద్ధులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం ఆశ్రమ వృద్ధులకు అన్నదాన సేవలు నిర్వహించారు. కార్యక్రమంలొ ఎస్వీ యోగ తెనాలి శాఖ కన్వీనర్ ఎమ్. రమణయ్య, ఎం శివ శంకర్, దివ్వెల ఏడుకొండలు, కటివరం గ్రామ ఉప సర్పంచ్ మంచాల సురేష్, తోటకూర కోటీశ్వరరావు, కే శ్రీనివాసులు, రామిశెట్టి నరసింహ, తదితరులు సాంబశివరావుకు శుభాకాంక్షలు తెలిపారు.

## పేద కుటుంబాలను ఆదుకుంటున్న సీఎం సహాయ నిధి : చీఫ్ విప్ జీవీ



**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్ ) :** సీఎం సహాయనిది పేదల పాలిటి పెన్నిదని ప్రభుత్వ చీఫ్ విప్, శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు అన్నారు. నియోజకవర్గ పరిధిలోని సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా 61మంది లబ్ధిదారులకు, 36లక్షలు 22 వేలు చెక్కులను ఆదివారం తన కార్యాలయంలో చీఫ్ విప్ జీవీ గారు పంపిణీ చేశారు. వైద్య పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వైద్య సహాయం కోసం సీఎం చంద్రబాబు నాయుడు గారు అందించిన నిధులు, తమకు అందేలా కృషిచేసిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవీకి చెక్కులు అందుకున్న లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా హనుమత్ కల్యాణం



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** శ్రీవారి వార్షిక బ్రంహోత్సవాలలొ భాగంగా శ్రీ సువర్చల సమేత శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి కల్యాణం భక్తుల నలరించింది. స్థానిక షరాఫ్ బజార్ లోని శ్రీ సువర్చల సమేత శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా శనివారం రాత్రి శ్రీ సువర్చల హనుమత్ కళ్యాణోత్సవం కనుల పండుగ నిర్వహించారు. స్వామివారిని గజ వాహన సేవలొ,,అమ్మవారు గరుడవాహన సేవలొ, ముస్తాబు చేసి,పట్టణ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఎదురుకోల ఉత్సవం నిర్వహించి కల్యాణోత్సవం ను అర్చకులు, పండితులు వైఖానస ఆగమోక్తంగా జరిపారు.

ఆలయ కార్య నిర్వహణ అధికారి హరిప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాలలో భక్తులు విశేషంగా పాల్గొని శ్రీ సువర్చల హనుమత్ కళ్యాణోత్సవమును తిలకించారు. ఆదివారం ఉదయం ఉష్ట్ర వాహన సేవ, సాయంత్రం విశేషంగా రథోత్సవ శోభాయాత్ర కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ వంశ పారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాస మూర్తి నేతృత్వం లో జరిగిన కార్యక్రమంలో విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని ప్రత్యేక అలంకరణతో ,విద్యుత్ దీపాలతో శోభాయ మానంగా తీర్చిదిద్దారు.

## నేడు గుంటూరులో పి.జి.ఆర్.ఎస్, రెవెన్యూ క్లినిక్

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :**ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్), రెవెన్యూ క్లినిక్ లను సోమవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పి.జి.ఆర్.ఎస్, రెవెన్యూ క్లినిక్ లను ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరం ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ రెవెన్యూ సమస్యలకు త్వరితగతిన పరిష్కారం అందించేందుకు జిల్లా స్థాయి రెవెన్యూ క్లినిక్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చెప్పారు. రెవిన్యూ క్లినిక్ లలో జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లు, గుంటూరు, తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారులు గ్రామ స్థాయి రికార్డులతో హాజరు అవుతారని తెలిపారు. మండలాల వారీగా కౌంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. రెవెన్యూ క్లినిక్స్ ఏర్పాటు చేసి, ప్రజల నుంచి అర్జీలను నేరుగా స్వీకరించి నమోదు చేయడంతో పాటు, సమస్యల స్వరూపాన్ని బట్టి అక్కడికక్కడే పరిష్కార చర్యలు చేపడతామని తెలిపారు. అప్పటికప్పుడే పరిష్కారం చేయలేని సమస్యలను వారం రోజులలో పరిష్కారం చేయుటకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను డివిజనల్, మండల రెవిన్యూ అధికారులు సమర్పిస్తామని వివరించారు.

**రెవెన్యూ క్లినిక్ కు నాలుగు కౌంటర్ లు**

రెవెన్యూ క్లినిక్ కు నాలుగు కౌంటర్ లు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చెప్పారు. మొదటి కౌంటర్లో కొత్త డి పట్టా మంజూరు, డి పట్టాదారుని పేరు రెవెన్యూ రికార్డులలో నమోదు చేయుట, ప్రభుత్వ మరియు ప్రైవేటు భూముల ఆక్రమణ, నిషేధిత భూములు 22 (ఏ) నుండి తొలగించుట, కొత్త ఇండ్ల స్థలము పట్టాకు అర్జీలు సమర్పించవచ్చని అన్నారు. రెండవ కౌంటర్లో భూ సేకరణ సమస్యలు, సి.ఆర్.డి.ఏ సమస్యలు, అర్బన్ ల్యాండ్ సీలింగ్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ పరిహారం, పౌర సరఫరాలకు సంబంధించిన అంశాలు, ఎఫ్ఎంసి, కులం, పుట్టిన తేదీ, మరణ ధ్రువీకరణ పత్రాలు తదితర సర్టిఫికెట్లకు, మీ సేవకు సంబంధించినవి తీసుకోవడం జరుగుతుందన్నారు. మూడవ కౌంటర్లో సుమోటో సవరణలు, ప్రైవేటు భూముల వివరాలు రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయుట, కొరిలేషన్ సవరణలు, ఆర్ఓఆర్ సమస్యలు, సివిల్ తగాదాలు, భూమి మార్పిడి – వ్యవసాయం నుండి వ్యవసాయేతర అంశాలు సమర్పించాలన్నారు.

నాలుగవ కౌంటర్లో రీసర్వే సమస్యలు, సర్వే సబ్ డివిజన్ మరియు ఎఫ్ లైన్ హద్దులకు, ఇతర సర్వే సమస్యలకు సంబంధించిన అంశాలు సమర్పించాలని తెలిపారు.

**మీకోసం వెబ్ సైట్ లో ఆర్జీలు సమర్పించవచ్చు**

ప్రజలు తమ సమస్యలను మీకోసం వెబ్ సైట్ లోను అర్జీలు సమర్పించవచ్చని జిల్లా కలెక్టర్ చెప్పారు. అర్జీల వివరాలు (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ లో నమోదు చేసుకోవచ్చని చెప్పారు. పి.జి.ఆర్.ఎస్ ను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. పి.జి.ఆర్.ఎస్ లో సమర్పించిన అర్జీల స్థితిని 1100 టోల్ ఫ్రీ ఫోన్ నంబర్ కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. అర్జీలను మీకోసం వెబ్ సైట్ లోను సమర్పించవచ్చని చెప్పారు.

# సందడి సందడిగా విజ్ఞాన్ బాల మహోత్సవ్

- క్రీడలకు సమయం కేటాయించాలి
- రెండో రోజు వైభవంగా కొనసాగిన విజ్ఞాన్ బాల మహోత్సవ్--2కే26
- పోటాపోటీగా కొనసాగుతున్న పోటీలు



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :**ఒకటి కాదు... రెండు కాదు.. ఏకంగా 50కిపైగా ఈవెంట్లు. కనుచూపు మేర ఎటువైపు చూసినా విద్యార్థులు క్రీడా--సాంస్కృతిక సంబరాల్లో మునిగిపోయారు. వాలీబాల్, కబడ్డీ, ఖో--ఖో, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, చెస్, అథ్లెటిక్స్‌తో పాటు క్లాసికల్ డాన్స్ సోలో, వెస్ట్రన్, ఫోక్ గ్రూప్, వెస్ట్రన్ డాన్స్ గ్రూప్, కర్ణాటిక్ వోకల్ సోలో, సింగింగ్ ఐడల్--లిటిల్ చాంప్, గ్రూప్ సింగింగ్ (ఫోక్, దేశభక్తి గీతాలు), మ్యూజిక్ ఇన్‌స్ట్రుమెంట్ సోలో, ఎస్సే రైటింగ్, లెటర్ రైటింగ్, స్టోరీ టెల్లింగ్, స్పెల్‌బీ... ఇలా అనేక విభాగాల్లో విద్యార్థులు అద్భుత ప్రదర్శనలతో ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. ఒకరితో ఒకరు "నువ్వా నేనా" అన్నట్లుగా పోటీపడి తమ ప్రతిభను చాటుకున్నారు.

చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి రెండో ఎడిషన్ "విజ్ఞాన్ బాల మహోత్సవ్--2కే26" రెండో రోజు ఆదివారం సందడి సందడిగా సాగింది. క్రీడా మైదానాల నుంచి సాంస్కృతిక వేదికల వరకూ ఎక్కడ చూసినా విద్యార్థుల ఉత్సాహం, కేరింతలు, చప్పట్ల శబ్దాలతో యూనివర్సిటీ ప్రాంగణం కళకళలాడింది.

నేడు జరిగే ముగింపు వేడుకలకు విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్ మల్లవరపు సూర్యతేజ (ఐఆర్ఎంఎస్) ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. వివిధ క్రీడా, సాంస్కృతిక పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు నేడు రూ. 5 లక్షల నగదు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలు, మెమొంటోలు అందజేయనున్నారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విజ్ఞాన్స్ వర్సిటీ ఇంచార్జి వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిషోర్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజూ కొంత సమయం క్రీడలకు కేటాయించాలని సూచించారు. శారీరక ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ చదువుపై దృష్టి పెట్టినప్పుడే సంపూర్ణ అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఫిజికల్‌గా ఫిట్‌గా ఉంటే మెంటల్‌గా కూడా బలంగా ఉంటారని, దాంతో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని చెప్పారు.

ఇలాంటి బాల మహోత్సవాల ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బృంద స్ఫూర్తి, క్రమశిక్షణ, సహకారం వంటి విలువలు పెంపొందుతాయని పేర్కొన్నారు. చిన్ననాటి నుంచే ఇటువంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనే విద్యార్థులే భవిష్యత్తులో ఉన్నతంగా స్థిరపడతారని అన్నారు. మీ కలలను నిజం చేసుకునే శక్తి మీలోనే ఉందని, అంకితభావంతో కృషి చేస్తే ఏ లక్ష్యమైనా సాధించవచ్చని విద్యార్థులను ప్రోత్సహించారు.

క్రీడలు కేవలం శారీరక ఉల్లాసానికే కాకుండా మానసిక ఉల్లాసానికి, స్నేహబంధాల బలోపేతానికి కూడా దోహదపడతాయని తెలిపారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సృజనాత్మకత అంశాల్లో ప్రతిభ చూపినప్పుడే ఒక విద్యార్థి సంపూర్ణంగా ఎదుగుతాడని స్పష్టం చేశారు.

అంతేకాకుండా 1) సమయ పాలన, 2) లక్ష్య నిర్ధారణ, 3) శ్రద్ధగా వినడం, 4) నిర్వహణ నైపుణ్యాలు, 5) అప్‌డేట్‌గా ఉండటం, 6) కమ్యూనికేషన్, 7) నెట్‌వర్కింగ్, 8) పఠన అలవాట్లు వంటి అంశాల్లో విద్యార్థులు నిష్ణాతులవుతారని తెలిపారు. "ఇది సాధించలేనేమో" అనే భయం, సందేహాలకు జీవితంలో ఎప్పుడూ తావివ్వొద్దని సూచించారు.

**కళలతో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు**

విజ్ఞాన్ బాల మహోత్సవ్‌లో భాగంగా నిర్వహిస్తున్న పోటీల్లో విద్యార్థులు నువ్వా నేనా అన్నట్లుగా పోటీపడుతున్నారు. క్రీడా పోటీలలో భాగంగా వాలీబాల్, కబడ్డీ, ఖో--ఖో, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, చెస్, అథ్లెటిక్స్ (100 మీటర్లు, 800 మీటర్లు, 4“100 మీటర్లు రిలే, లాంగ్‌జంప్, షాట్‌పుట్) వంటి విభాగాల్లో ఉత్కంఠభరితమైన పోటీలు జరిగాయి.

నృత్య--సంగీత విభాగంలో క్లాసికల్ డాన్స్ సోలో, వెస్ట్రన్, ఫోక్ గ్రూప్, వెస్ట్రన్ డాన్స్ గ్రూప్, కర్ణాటిక్ వోకల్ సోలో, సింగింగ్ ఐడల్--లిటిల్ చాంప్, గ్రూప్ సింగింగ్ (ఫోక్, దేశభక్తి గీతాలు), మ్యూజిక్ ఇన్‌స్ట్రుమెంట్ సోలో ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

నాటక--సాహిత్య విభాగంలో స్కిట్, మైమ్, ఎలక్యూషన్ (తెలుగు, ఇంగ్లీష్), ఎస్సే రైటింగ్, లెటర్ రైటింగ్, స్టోరీ టెల్లింగ్, స్పెల్‌బీ వంటి పోటీలు విద్యార్థుల సృజనాత్మకతను చాటిచెప్పాయి.

సృజనాత్మక కళలు--ఫ్యాషన్ విభాగంలో ఆన్ ద స్పాట్ పెయింటింగ్, క్లే మోడలింగ్, ట్రెడిషనల్ అండ్ ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషన్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఈ పోటీలన్నీ ఇప్పుడు సెమీ ఫైనల్స్ దశకు చేరుకోగా, నేడు ఫైనల్స్ పోటీలు జరగనున్నాయి. విజేతలకు ముగింపు కార్యక్రమంలో ట్రోఫీలు, ప్రశంసా పత్రాలతో పాటు నగదు బహుమతులు అందజేయనున్నారు.

కార్యక్రమంలో విజ్ఞాన్స్ వర్సిటీ ఇంచార్జి వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిషోర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, ఫిజికల్ డైరెక్టర్లు, కోచ్‌లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## కిలారి దిలీప్ ఆధ్వర్యంలో బిజెపి రాష్ట్ర కార్యాలయంలో బడ్జెట్ సంబరాలు



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత బిజెపి రాష్ట్ర కార్యాలయంలో పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మీడియా ఇంచార్జీ కిలారి దిలీప్ మాట్లాడుతూ, కేంద్రం కొత్తగా ఏడు హైస్పీడ్ రైల్ కారిడార్లను ప్రకటించినట్లు తెలిపారు. ఇందులో హైదరాబాద్–పూణె, హైదరాబాద్–బెంగళూరు, హైదరాబాద్–చెన్నై, ఢిల్లీ–వారణాసి, వారణాసి–సిలిగూడి వంటి ప్రధాన కారిడార్లు ఉన్నాయి.

కేంద్రం పరిశ్రమలు మరియు విద్యాసంస్థల మధ్య అనుసంధానాన్ని పెంచుతూ, హైటెక్ టూల్ రూమ్‌లు ఏర్పాటు చేస్తోందని చెప్పారు. అలాగే దేశంలో మెడికల్ టూరిజాన్ని ప్రోత్సహించడానికి ప్రత్యేక పథకాలు తీసుకొచ్చినట్లు దిలీప్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్, రవీంద్ర రెడ్డి, చైతన్య శర్మ తదితరులు పాల్గొన్నారు. బడ్జెట్ విజయాన్ని పార్టీ శ్రేణులు ఆనందంగా జరుపుకున్నారు.

## 'ఎన్‌జీజీఓ విద్యాసాగర్' నేతృత్వంలో సీపీఎస్ ఉద్యోగులకు మంచి రోజులు



○ **ఏపీ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్**

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** సీపీఎస్ ఉద్యోగులకు డీఏ బకాయిలు మంజూరు చేయడం, అలాగే రిటైర్డ్ అయిన సీపీఎస్ ఉద్యోగులకు కూడా హెల్త్ కార్డులు మంజూరు చేయించడంలో విశేష కృషి చేసిన ఏపీ ఎన్‌జీజీఓ రాష్ట్ర అధ్యక్షులు, ఏపీ జేఏసీ ఛైర్మన్ ఆలపర్తి విద్యాసాగర్, అలాగే ఎన్‌జీజీఓ ప్రధాన కార్యదర్శి రమణను ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర అధ్యక్షులు కె. సతీష్, ప్రధాన కార్యదర్శి సీఎం దాస్ సత్కరించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యుల సమక్షంలో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ, సీపీఎస్ ఉద్యోగుల హక్కుల సాధనలో ఆలపర్తి విద్యాసాగర్ పోరాటం, పట్టుదల అభినందనీయమని తెలిపారు. ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రభుత్వం మీద నిరంతర ఒత్తిడి తెచ్చి, డీఏ బకాయిల మంజూరుకు, రిటైర్డ్ ఉద్యోగులకు కూడా వైద్య కార్డులు అందేలా చేయడంలో చేసిన కృషి చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. ఈ విజయాలు లక్షలాది సీపీఎస్ ఉద్యోగ కుటుంబాలకు ఉపశమనం కలిగించాయని, భవిష్యత్తులోనూ ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం సంఘాలు కలిసికట్టుగా పోరాడాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీసీపీఎస్ ఈఏ రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఏపీజేఏసి అమరావతి మహాసభకు స్పెషల్ క్యాజువల్ లీవు మంజూరు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఫిబ్రవరి 5న విజయవాడలో జరిగే ఏపీజేఏసి అమరావతి రాష్ట్ర మహాసభకు హాజరయ్యే ఉద్యోగులకు రెండు రోజులు స్పెషల్ క్యాజువల్ లీవు మంజూరు చేయడంపై ఏపీజేఏసి అమరావతి రాష్ట్ర కమిటీ హర్షం వ్యక్తం చేసింది.

ఏపీజేఏసి అమరావతి నాల్గవ రాష్ట్ర మహాసభ ఫిబ్రవరి 5న (గురువారం) విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి రాష్ట్రవ్యాప్తంగా 90 విభాగాల సంఘాలకు చెందిన ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 4న ప్రయాణం కోసం, 5న మహాసభకు హాజరయ్యేందుకు రెండు రోజులు స్పెషల్ క్యాజువల్ లీవు మంజూరు చేయాలని సంఘం నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దానికి స్పందించిన ప్రభుత్వం జనవరి 31వ తేదిన మెమో ద్వారా ఆదేశాలు జారీ చేసింది. ఈ నిర్ణయంతో ఉద్యోగుల్లో ఉత్సాహం నెలకొందని నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు, అసోసియేట్ ఛైర్మన్ టి.వి. ఫణిపేర్రాజు, కోశాధికారి కె. సంగీతరావు ఒక ప్రకటనలో ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, ఈ నిర్ణయానికి సహకరించిన చీఫ్ సెక్రటరీ కె. విజయానంద్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్. రావత్, ముఖ్యమంత్రి కార్యాలయ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ముద్దాడ రవిచంద్రలకు కూడా ధన్యవాదాలు తెలిపారు.

## అమరావతికి బడ్జెట్లో నిధుల కేటాయింపుపై హర్షం వ్యక్తం చేసిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ



**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్):** కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ 2026–27 ఆర్థిక సంవత్సరానికి పార్లమెంటులో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్లో అమరావతి నిర్మాణానికి, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు మౌలిక వస్తుల కల్పనకు నిధుల కేటాయింపుపై ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏపీ రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధికి రూ. 1128.91 కోట్లు (ఏడిబి) నిధులు కేటాయింపుతో రాజధాని అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. పట్టణ అభివృద్ధికి రూ. 800 కోట్లు, గ్రామీణ రోడ్లకు 500.99 కోట్లు, ప్రకృతి వ్యవసాయానికి రూ. 155.32 కోట్లు నిధుల కేటాయింపు సంతోషకరమన్నారు. రాష్ట్ర రాజధానిగా అమరావతి ఆంధ్రుల కళ అని, రాజధాని నిర్మాణం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తోనే సాధ్యమవుతుందని అన్నారు. అమరావతి రాజధాని ఏర్పాటు చేసి ప్రపంచ దేశాల నుంచి పెట్టుబడులు తెచ్చి రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించి వాస్తా అభివృద్ధికి సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తుంటే జగన్, వైసిపి నేతలు "అమరావతి విజన్"ను అధికార దాహంతో నాశనం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని, వారి చరిత్ర హీనులుగా మిగిలిపోతారని అన్నారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునేందుకు కుట్రలు చేస్తే పుట్టగతులు ఉండవలన్నారు. ఒక్క అవకాశం అని ప్రజలు నమ్మి అవకాశం ఇస్తే జగన్ రాష్ట్రాన్ని లూటీ చేశారని అన్నారు. ప్రజాస్వామ్యం అంటే గౌరవం లేకుండా, రాజకీయాలంటే విలువలు తెలియని వ్యక్తులు ఉండటం దురదృష్టకరమని, సీఎం చంద్రబాబు నాయుడును దూషించిన సంస్కారహీనుడు, నీచుడు అంబటి రాంబాబుని రాష్ట్ర బహిష్కరణ చేయాల్సి ఉందన్నారు.

## రహదారి ప్రమాదాలు తీవ్రమైన సమస్యలకు దారి తీస్తుంది : కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** దేశంలో రహదారి ప్రమాదాలు వలన తీవ్రమైన పబ్లిక్ హెల్త్ ఇష్యూ, పేదరికం , ప్రోడక్టవిటీ సమస్యలకు దారి తీస్తుందని, సురక్షితమైన ప్రయాణానికి రహదారి భద్రత నిబంధనలు వాహనదారులు పాటించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి మరియు కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డా పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. కలెక్టరేట్ లోని ఎస్ ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా చేపట్టిన "శిక్షణతో భద్రత, సాంకేతికత ద్వారా పరివర్తన" కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డా పెమ్మసాని చంద్రశేఖర్, జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, శాసన సభ్యులు బూర్ల రామాంజనేయులు, గల్లా మాధవి, రాష్ట్ర లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు పాల్గొన్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మరియు కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డా పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ దేశంలో ప్రతి సంవత్సరం 1.60 లక్షల మంది రహదారి ప్రమాదాల్లో చనిపోతున్నారని చెప్పారు. ఇది విమాన ప్రమాదాలు, భూకంపాలు , యుద్దాలు జరిగినప్పుడు మరణించే వారి సంఖ్య కంటే ఎక్కువగా ఉంటుందన్నారు. ఇలా చనిపోయేవారిలో సగం మంది పైగా యువతే ఉంటున్నారని చెప్పారు. పరిపక్వత లేని మెదడు వలన వాహన ప్రమాదాలు వలన జరిగే తీవ్ర నష్టాలపై అవగాహన లేక రహదారి భద్రత నిబంధనలపై యువత నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. యాక్సిడెంట్లలో వెన్నుపూసలు, కాలి, చేతి ఎముకలు తదితర ప్రమాదాలు జరిగి జీవితాంతం మంచం పాలు అయితే, ఆ ప్రభావం మీ పైనే మాత్రమే కాదు యావత్ కుటుంబ భవిష్యత్తుపైనే ప్రభావం చూపుతోందని మర్చిపోవద్దని హితవు పలికారు. హెల్మెట్ ధరించడం వల్ల జుట్టు రాలిపోతుంది అనేది కేవలం అపోహ మాత్రమే అని, ఎంతోమంది రేసర్లు నిత్యం హెల్మెట్ పెట్టుకుంటున్నా ఎ ఒక్కరికీ జుట్టు రాలడంలేదని అందరూ గుర్తించాలన్నారు. కొద్ది మోతాదులో మద్యం సేవించిన అది మెదడుపై తీవ్ర ప్రభావాన్ని చూపి వాహనం నడిపేటప్పుడు ప్రమాదానికి దారితీస్తుందన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు నడిపేవారు సీటు బెల్టు ధరించాలని, మద్యం సేవించి, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలను నడపరాదన్నారు. రహదారి భద్రత నిబంధనలు పాటించడం ద్వారానే మన ప్రమేయం లేకుండా జరిగే వాహన ప్రమాదాల నుంచి రక్షణ పొందవచ్చు అన్నారు. రహదారి ప్రమాదాలను నివారించేందుకు ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. రహదారి భద్రత నిబంధనలపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించడంతోపాటు, నిబంధన ఉల్లంగించే వారిపై నిరంతరం తనిఖీ నిర్వహించి కఠిన చర్యలు తీసుకుంటున్నారన్నారు. వాహనదారులకు ఇబ్బంది లేకుండా గుంతల రహితంగా రహదారులను తీర్చిదిద్దడంతోపాటు, ప్రమాదాలకు అవకాశం ఉన్న బ్లాక్ స్పాట్ వద్ద ఎప్పటికప్పుడు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రమాదంలో గాయపడిన వారికి తక్షణమే వైద్య సహాయం అందించేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజలు ముఖ్యంగా యువత రహదారి భద్రత నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నివారణకు సహకరించాలన్నారు.

జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రహదారి భద్రతా నిబంధనలు బాధ్యతగా పాటించటం ద్వారా అమూల్యమైన ప్రాణాలను కాపాడుకోవచ్చు అన్నారు. దేశంలో జరుగుతున్న రహదారి ప్రమాదాల్లో జాతీయ సంపద అయిన యువత ఎక్కువగా మరణించటం ఆందోళన కలిగిస్తుందన్నారు. హెల్మెట్, సీటు బెల్ట్ ధరించకపోవడం, మితిమీరిన వేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వలన ఎక్కువగా రహదారి ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో ప్రచారం కోసం వాహనాలతో స్టైంట్ లు చేయడం ప్రమాదాలకు దారి తీస్తుందన్నారు. ప్రమాదాలకుగురైతే భవిష్యత్తు నాశనమవడంతో పాటు, కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని చెప్పారు.

జిల్లాలో రగదారి ప్రమాదాలు నివారణకు ప్రతినెల రవాణా, పోలీస్, రహదారులు, స్థానిక సంస్థల శాఖలతో రహదారి భద్రతా కమిటీ సమావేశ నిర్వహించి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. రహదారి భద్రతా నిబంధనలపై, ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన చర్యలపై నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

శాసనసభ్యులు గల్లా మాధవి మాట్లాడుతూ పాఠశాల, కళాశాల స్థాయి నుంచే విద్యార్థులు, యువతకు రహదారి భద్రత నిబంధనలపై అవగాహన కల్పించాలన్నారు. రహదారి ప్రమాదాల్లో భారతదేశం మొదటి స్థానంలో ఉండటం. ప్రమాదంలో చనిపోతున్నవారిలో 50% మంది యువత ఉండటం ఆందోళన కలిగిస్తుందన్నారు. అభివృద్ధి చెందిన పాశ్చాత్య దేశాలలో రహదారి భద్రత నిబంధనలు కఠినంగా అమలు చేస్తున్నారన్నారు. జిల్లాలో రహదారి భద్రత నిబంధనలు ఉల్లంఘించే వారిపై సంబంధిత శాఖలు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో ఆటోలు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు.

బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ కుటుంబంలో తల్లిదండ్రులు, భార్య, పిల్లలపై ప్రేమ ఉన్నవారు ఖచ్చితంగా రహదారి భద్రత నిబంధనలు పాటిస్తారన్నారు. . రహదారి ప్రమాదాల వలన మరణాల సంబంవించిన, క్షతగాత్రులైన కుటుంబసభ్యుల పరిస్థితి అస్తవ్యస్తంగా మారుతుందన్నారు. రహదారి భద్రత నిబంధనలు పాటించాలని విద్యార్థులు కుటుంబ సభ్యులకు తెలియచేయాలన్నారు జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, ఇతర పోటీలలో జిల్లాస్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థాయిలో విజేతలకు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, ఎమ్మెల్యేలు గల్లా మాధవి, బి. రామాంజనేయులు, బహుమతులను అందజేశారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కే ఖాజావలి, అడిషనల్ ఎస్పీ రమణమూర్తి, జిల్లా ఉప రవాణా కమిషనర్ సీతారామిరెడ్డి, ఆర్ అండ్ బీ ఎస్ఈ శ్రీనివాసమూర్తి, జాతీయరహదారుల పీడీ పార్వతీశం, ఆర్డీవో శ్రీనివాసులు, ఆర్టీవో శ్రీహరి, ఎంవీఐలు, ఏఎంవీఐలు, డ్రైవర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కేంద్ర బడ్జెట్ దేశ ఆర్థిక వృద్ధికి బలమైన పునాది

○ **బీజేపీ జిల్లా అధ్యక్షులు తిరుపతిరావు, ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్**



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** కేంద్ర బడ్జెట్ దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేస్తూ, అన్ని వర్గాల అభివృద్ధికి దోహదపడే విధంగా రూపొందించబడిందని భారతీయ జనతా పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు అన్నారు. గుంటూరులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో కేంద్ర బడ్జెట్‌పై అవగాహన, ప్రత్యక్ష వీక్షణ మరియు సమగ్ర సమీక్ష సమావేశం ఆయన అధ్యక్షతన ఘనంగా జరిగింది.

ఈ సందర్భంగా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎల్ఈడి స్క్రీన్ ద్వారా కేంద్ర బడ్జెట్ ప్రసారాన్ని పార్టీ నాయకులు, ఆర్థిక నిపుణులు, వ్యాపార వర్గాల ప్రతినిధులు ప్రత్యక్షంగా వీక్షించారు. అనంతరం బడ్జెట్‌లో ప్రతిపాదించిన కీలక అంశాలపై లోతైన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం బీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి, బడ్జెట్ సమీక్ష కార్యక్రమానికి జోనల్ ఇంచార్జ్ వల్లూరు జయప్రకాష్ నారాయణ మార్గదర్శకత్వంలో జరిగింది.

సమీక్షలో వ్యవసాయం, రైతు సంక్షేమం, పరిశ్రమలు, ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లు, మౌలిక వసతులు, రహదారులు, రైల్వేలు, విద్య, ఆరోగ్యం, యువత ఉపాధి, మహిళా సాధికారత, సామాజిక న్యాయం, బలహీన వర్గాల సంక్షేమం వంటి అన్ని రంగాలకు బడ్జెట్‌లో సముచిత ప్రాధాన్యం ఇచ్చినట్లు నాయకులు పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి, ఉపాధి సృష్టి, పెట్టుబడులు, పారిశ్రామిక వృద్ధికి ఈ బడ్జెట్ అనుకూలంగా ఉందని అభిప్రాయపడ్డారు.

ప్రత్యేకంగా రైతులు, మధ్యతరగతి, యువత, మహిళలు, వ్యాపార వర్గాలకు లాభం చేకూర్చే అనేక సంస్కరణాత్మక నిర్ణయాలు బడ్జెట్‌లో ఉన్నాయని తెలిపారు. 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని సాధించే దిశగా ఇది కీలక ముందడుగు అని, భారతదేశాన్ని ప్రపంచ ఆర్థిక శక్తిగా నిలబెట్టే దిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు ఇది స్పష్టమైన నిదర్శనమని వారు అన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆడిటర్లు కేవీ బ్రహ్మం, మన్నవ శ్రీనివాస్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు ఏల్చూరి వెంకటేశ్వర్లు, భారతీయ వికాస్ పరిషత్ అధ్యక్షులు బైరిశెట్టి మల్లికార్జునరావు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బిట్రా శివన్నారాయణ, పొగాకు బోర్డు చైర్మన్ సి. హెచ్. యశ్వంత్, రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్, జాతీయ స్పైసెస్ బోర్డు సభ్యులు కొత్తూరి వెంకట సుబ్బారావు, బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వెలగలేటి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అలాగే పార్లమెంట్ సంయోజక్ భీమినేని చంద్రశేఖర్, రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ తాడువాయి రామకృష్ణ, సీనియర్ నాయకులు పాలపాటి రవికుమార్, ఈదర శ్రీనివాసరెడ్డి, కొక్కెర శ్రీనివాస్ యాదవ్, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై. వి. సుబ్బారావు, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చరక కుమార్ గౌడ్, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కంతేటి బ్రహ్మయ్య, డా. శనక్కాయల ఉమాశంకర్ పాల్గొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శులు దేసు సత్యనారాయణ, బజరంగ్ రామకృష్ణ, తోట శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు విమలాదేవి, మేరీ సరోజినీ, సాధు రామకృష్ణ, జిల్లా కార్యదర్శులు క్రిష్టిపాటి నారాయణరెడ్డి, దానబోయిన శివయ్య, కోశాధికారి ఆమతి వెంకటరమణ, యువ మోర్చా జిల్లా అధ్యక్షులు యశ్వంత్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు డా. రాధా మాధవి, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు షేక్ సాంబశివరావు, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు కొర్రా శీను నాయక్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు ధారా అంబేద్కర్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు తురక రామారావు, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ తూనుగుంట్ల రాజేష్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సంత్ రవిదాస్ బోధనలు భావితరాలకు మార్గదర్శకం

○ **బీజేపీ జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు**



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** భక్తి మార్గ ప్రచారకుడు, సమానత్వ సందేశవాహకుడు సంత్ రవిదాస్ జయంతిని పురస్కరించుకొని స్థానిక జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యాలయం వాజ్‌పేయి భవన్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు డాక్టర్ ధారా అంబేద్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కంతేటి బ్రహ్మయ్య, బీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తక్కువ కులంలో జన్మించినప్పటికీ సంత్ రవిదాస్ తన ఆలోచనలతో, బోధనలతో సమాజానికి మార్గనిర్దేశం చేసిన మహానుభావుడని అన్నారు. చెప్పులు కుట్టే స్థాయి నుంచి మహోన్నత ఆధ్యాత్మిక బోధనలు ఇచ్చే స్థాయికి ఎదగడం అసాధారణమైన విషయమని తెలిపారు. ఉపాధినీ సేవగా భావించి, సంపాదనకన్నా మానవ సేవకే ప్రాధాన్యం ఇచ్చిన గొప్ప మనసు ఆయనదని కొనియాడారు.

సాధు–సన్యాసుల సేవలో భక్తి పరవశంతో కఠిన సాధనలోనూ దీక్షగా ఉండేవారని, చిన్ననాటి నుంచే సీతారాములను పూజిస్తూ ఆధ్యాత్మిక జీవితాన్ని గడిపిన మహానుభావుడని చెప్పారు. అటువంటి వ్యక్తి జీవితం భావితరాలకు ఆదర్శంగా నిలవాలని, నేటి తరాలకు మార్గదర్శకంగా ఆయన బోధనలను విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ గుంటూరు నగర అధ్యక్షులు దావులూరు కుమార్, కార్యక్రమ సహ సమన్వయకర్త గట్టుపల్లి అబ్రహం, ఏసోబు, రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు మేరీ సరోజినీ పాల్గొన్నారు.

అలాగే నాయకులు బిట్రా వెంకట శివన్నారాయణ, యశ్వంత్, కొత్తూరు వెంకట సుబ్బారావు, వెలగలేటి గంగాధర్, భీమినేని చంద్రశేఖర్, పాలపాటి రవికుమార్, తాడువాయి రామకృష్ణ, వై.వి. సుబ్బారావు, చరక కుమార్ గౌడ్, బజరంగ్ రామకృష్ణ, దేసు సత్యనారాయణ, తోట శ్రీనివాస్, క్రిష్టిపాటి నారాయణరెడ్డి, షేక్ సాంబశివరావు, డాక్టర్ రాధా మాధవి, తురక రామారావు, వివిధ మండల అధ్యక్షులు, జిల్లా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వికసిత భారత్ 2047కు బ్లూప్రింట్‌గా కేంద్ర బడ్జెట్

○ **బీజేపీ రాష్ట్ర ముఖ్య ఆధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్**



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** దేశ చరిత్రలో 80వ కేంద్ర బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ దేశ ఆర్థిక వృద్ధికి బలమైన పునాదిగా ఆంధ్రప్రదేశ్ బీజేపీ అభిప్రాయపడింది . ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్ స్లోగన్ల బడ్జెట్ కాకుండా, సమస్యలకు పరిష్కారం ఇచ్చే సొల్యూషన్ బడ్జెట్ అని, వాగ్దానాల బడ్జెట్ కాకుండా అమలు హామీ ఇచ్చే బడ్జెట్ అని బీజేపీ రాష్ట్ర ముఖ్య ఆధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ తెలిపారు. బడ్జెట్ వికసిత భారత్ ఏ2047 లక్ష్యానికి స్పష్టమైన రోడ్ మ్యాప్ చూపిస్తుందన్నారు.

రైతు శ్రేయస్సుకు బడ్జెట్ ప్రత్యేక దృష్టి పెట్టింది. మాటలేమీ కాకుండా పంట ఉత్పత్తి, మార్కెటింగ్, ప్రాసెసింగ్, ఎగుమతులు అన్నీ కలిపిన సమగ్ర విధానాన్ని కేంద్రం తీసుకువచ్చినట్లు తెలిపారు. రైతులను ఓటుబ్యాంక్‌గా కాకుండా దేశ నిర్మాతలుగా చూడటం ప్రభుత్వ విధానం అని వివరించారు. యువతకు అవకాశాలు సృష్టించడానికి నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లు, మాన్యుఫ్యాక్చరింగ్, డిజిటల్ ఎకానమీపై బడ్జెట్ ముఖ్యంగా దృష్టి పెట్టిందని చెప్పారు. యువతకు నిరుద్యోగ భృతి కాకుండా గౌరవప్రదమైన ఉపాధి అందించడం లక్ష్యంగా ఉందని జయప్రకాశ్ నారాయణ పేర్కొన్నారు. మధ్యతరగతికి భద్రత కోసం పన్నుల సరళీకరణ, మౌలిక వసతులలో పెట్టుబడులు, ఆరోగ్యం మరియు విద్య రంగాలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా కుటుంబాలపై భారం తగ్గించడం బడ్జెట్ లక్ష్యం అని తెలిపారు.

ఏపీ అభివృద్ధికి కేంద్రం స్పష్టమైన ప్రాధాన్యత ఇచ్చిందని, అమరావతి అభివృద్ధికి సుమారు 1,128.91 కోట్ల రూపాయల కేటాయింపు చేసినట్లు చెప్పారు. ఇందులో అమరావతి ఇంటిగ్రేటెడ్ అర్బన్ డెవలప్‌మెంట్ కోసం 432.09 కోట్లు, పట్టణ తాగునీరు, మురుగు నీటి పారుదలకి 800 కోట్లు, గ్రామీణ రహదారులకు 500.99 కోట్లు, రోడ్లు, వంతెనలు పునర్నిర్మాణం కోసం 350 కోట్లు కేటాయించబడినట్లు వివరించారు.

విద్యా, పరిశోధన రంగాల కోసం కేంద్రం గ్రాంట్లు ప్రకటించడం జరుగుతుందని, అణుశక్తి విభాగం, అంతరిక్ష విభాగం ద్వారా అమరావతి, విజయవాడ ప్రాంతంలోని ముఖ్య విద్యాసంస్థలకు సహాయం అందుతుందని చెప్పారు. కేంద్ర–రాష్ట్ర సమన్వయం ద్వారా ఏపీ అభివృద్ధికి దీర్ఘకాల లాభాలు చేకూరుతాయని, ఈ బడ్జెట్ రాష్ట్ర అభివృద్ధికి మైలురాయి అవుతుందని వల్లూరు జయప్రకాశ్ నారాయణ పేర్కొన్నారు.

## దేశ ఆర్థిక స్థిరత్వానికి భరోసా ఇచ్చిన కేంద్ర బడ్జెట్ బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ బాజీ



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 80వ కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయం, పరిశ్రమ, యువత, క్రీడలు, హ్యాండ్లూమ్, వస్త్ర పరిశ్రమ, సాంకేతిక రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చినట్లు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ బాజీ తెలిపారు. ఈ బడ్జెట్ 'వికసిత భారత్ ఏ2047' లక్ష్యాన్ని సాధించడానికి స్పష్టమైన రోడ్ మ్యాప్ చూపిస్తూ, యువతకు ఉద్యోగాలు, రైతులకు ఆదాయం, మధ్యతరగతికి భద్రత – ఈ మూడు ప్రధాన స్థంభాలపై నిలబడిందని చెప్పారు. రైతుల సంక్షేమానికి పంట ఉత్పత్తి, మార్కెటింగ్, ప్రాసెసింగ్, ఎగుమతులను కలిపిన సమగ్ర ప్రణాళికతో మద్దతు ఇచ్చిన బడ్జెట్, రైతులను దేశ నిర్మాతలుగా చూడడంలో కేంద్రం ధోరణి స్పష్టమని తెలిపారు. అలాగే, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లు, మాన్యుఫ్యాక్చరింగ్, డిజిటల్ ఎకానమీ ద్వారా యువతకు గౌరవప్రదమైన ఉపాధి అవకాశాలను సృష్టించడం, పన్నుల సరళీకరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆరోగ్యం–విద్య రంగాల్లో పెట్టుబడులు ద్వారా మధ్యతరగతి కుటుంబాల భారం తగ్గించడం ఈ బడ్జెట్ లక్ష్యమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కూడా ప్రత్యేక కేటాయింపులు కల్పించబడ్డాయని షేక్ బాజీ తెలిపారు. అమరావతి అభివృద్ధికి సుమారు రూ. 1,128.91 కోట్లను కేటాయించడం, పట్టణ తాగునీరు, మురుగునీటి పారుదల, గ్రామీణ రహదారులు, వంతెనలు, విద్యా, పరిశోధన గ్రాంట్లకు ప్రత్యేక నిధులు మంజూరు చేయడం ద్వారా రాష్ట్రానికి దీర్ఘకాల లాభాలు కలుగుతాయని, దేశవ్యాప్తంగా సాంకేతిక, పరిశ్రమల రంగాల్లో పెట్టుబడులు, ఆధునీకరణ, కొత్త పరిశోధన కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యం సాధించబడతుందని చెప్పారు.

## ఉత్తమ నటుడిగా అంతర్జాతీయ అవార్డ్ అందుకున్న జర్నలిస్ట్ పులిగడ్డ



○ **రోటరీ క్లబ్ లఘుచిత్ర పోటీల్లో జీవధార**

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** రోటరీక్లబ్ కళాచైతన్యం అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన తెలుగు షార్ట్ ఫిల్మ్ పోటీల లో నీటి ప్రాముఖ్యత ను తెలియజేస్తూ గాదెనాగభూషణం దర్శకత్వంలో రూపొందిన "జీవధార" షార్ట్ ఫిల్మ్ లో ప్రధాన పాత్ర లో నటించిన లిజర్నలిస్ట్ పులిగడ్డ సత్యనారాయణకు ఉత్తమ నటుడు అవార్డ్ అందుకున్నారు. హైదరాబాద్ లో నిర్వహించిన మనోహరం డిస్ట్రిక్ట్ కాన్ఫరెన్స్ లో డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రాంప్రసాద్, అనిత ప్రసాద్చేతుల మీదుగా ఈ అవార్డు తీసుకున్నారు. బేబిచరణ్య సమర్పణలో త్రినేత్ర ప్రొడక్షన్స్ ఆధ్వర్యంలో గాదెనాగభూషణం రచన, దర్శకత్వంలో నిర్మితమైన "జీవధార" షార్ట్ ఫిల్మ్ కు ఇంటర్నేషనల్ అవార్డ్ దక్కింది. ఈ సందర్భంగా జర్నలిస్ట్ పులిగడ్డ సత్యనారాయణ మాట్లాడుతూ సామాజిక అంశాలపై రోటరీ క్లబ్ అంతర్జాతీయ స్థాయిలో షార్ట్ ఫిలిమ్స్ కాంపిటీషన్ నిర్వహించింది, ఈ పోటీలకు అంతర్జాతీయ స్థాయిలో విశేషంగా లఘు చిత్రాలు ఎంట్రీకి రాగా వాటిలో పలు అంశాలలో బహుమతులు ప్రకటించగా ఉత్తమ నటుడు అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. తనకు అవార్డుకు ఎంపిక చేసిన జ్యూరీ కృతజ్ఞతలు తెలియజేశారు. కాగా జీవధార షార్ట్ ఫిల్మ్ ను రూపొందించిన రచయిత, దర్శకుడు గాదెనాగభూషణం, ఈ ఫిల్మ్ లో నటించి అంతర్జాతీయస్థాయిలో ఉత్తమ నటుడు అవార్డ్ అందుకున్న జర్నలిస్ట్ పులిగడ్డ సత్యనారాయణ కు ఉండవల్లి గ్రామ ప్రజలు, కళారంగ ప్రముఖులు అభినందనలు తెలియజేశారు.

## కేంద్ర బడ్జెట్‌పై ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసు అసోసియేషన్ అసంతృప్తి

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** కేంద్ర ప్రభుత్వం ఆదివారం ప్రవేశపెట్టిన 2026–2027 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు ఎలాంటి ప్రయోజనం లేదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాంద్ బాష వ్యాఖ్యానించారు. గత 2025–2026 సంవత్సరంలో అమలులో ఉన్న ఆదాయపు పన్ను విధానాన్నే యథాతథంగా కొనసాగించడం వల్ల ఉద్యోగులకు ఉపశమనం లభించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బడ్జెట్‌లో ప్రభుత్వ ఉద్యోగుల జీవనభారం తగ్గించే ఎలాంటి నిర్ణయాలు లేకపోవడం నిరాశ కలిగించిందన్నారు. కనీసం వార్షిక ఆదాయపు పన్ను మినహాయింపును 12 లక్షల నుంచి 15 లక్షల వరకు పెంచి ఉంటే ఉద్యోగులకు కొంత ఊరట లభించేదని ఆయన సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పరిగణనలోకి తీసుకుని భవిష్యత్తులో తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467